ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శుక్రవారం 14 ఫిబ్రవరి 2025


ఎక్స్‌కవేటర్‌తో కాలువలో పనులు చేస్తున్న దృశ్యం

పనులు చేపట్టక ముందు చెట్లు, ముళ్ల పొదలతో నిండిపోయిన కుడికాలువ




పనులు చేపట్టిన తర్వాత కనిపిస్తున్న కుడికాలువ



పెద్దేరు కాలువలకు మహర్దశ

- మరమ్మతులకు రూ.92 లక్షలు మంజూరు
- శరవేగంగా జరుగుతున్న ఆధునికీకరణ పనులు
- తంబళ్లపల్లె, పెద్దమండ్యం ఆయకట్టు రైతుల్లో ఆనందం

ఏళ్ల తరబడి జమ్ము, పిచ్చిమొక్కలతో నిండిపోయిన పెద్దేరు ప్రాజెక్టు కాలువలకు కూటమి ప్రభుత్వంలో మోక్షం లభిస్తోంది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన కొత్తలో కాలువల పనులు జరిగాయి. అనంతరం వాటిని పట్టించుకోకపోవడంతో కాలువల్లో నీరు పారక ఆయకట్టు అంతా బీడుగా మారిపోయింది. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కాలువల మరమ్మతులకు రూ.92 లక్షలు విడుదల చేయడంతో కాలువల ఆధునికీకరణ పనులు వేగంగా జరుగుతున్నాయి.


పెద్దేరు ప్రాజెక్టు

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె, పెద్దమండ్యం మండలాల రైతుల కల్పతరువు పెద్దేరు ప్రాజెక్టు సాగునీటి కాలువలు కొన్నేళ్లుగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో అధ్వానంగా తయారయ్యాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో కాలువల నిర్వహణ కొరవడటంతో వాటి రూపు కోల్పోయాయి. దీంతో ఆయకట్టు చివరి భూములకు నీరందని పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వ్యవసాయం, రైతుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ వహించింది. పెద్దేరు ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణకు రూ.92 లక్షలు మంజూరు చేసింది. నెల రోజుల నుంచి కాలువల ఆధునికీకరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. దీంతో వచ్చే ఖరీఫ్, రబీ సీజన్‌లకు కాలువల ద్వారా పూర్తి స్థాయిలో పంటలకు నీరు అందుతుందని తంబళ్లపల్లె, పెద్దమండ్యం మండలాల ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తంబళ్లపల్లె, పెద్దమండ్యం మండలాల కల్పతరువు

తంబళ్లపల్లె, పెద్దమండ్యం మండలాలకు కల్పతరువైన పెద్దేరు ప్రాజెక్టును తంబళ్లపల్లె మండలం కొటాల గ్రామంలో రెండు కొండల నడుమ పెద్దేరు వాగుపై నిర్మించారు. 1976 అక్టోబరులో ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభించగా 1980 డిసెంబరు నాటికి పూర్తయ్యింది. 590 మీటర్ల పొడవున్న పెద్దేరు ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 560 మిలియన్ క్యూబిక్ ఫీట్ (ఎంసీఎఫ్‌టీ)లు. కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 383 ఎంసీఎఫ్‌టీల నీరుంది. ప్రాజెక్టు నీటి పరీవాహక ప్రాంతం 52.58 చదరపు మైళ్లు. పెద్దేరు ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల కింద 4,300 ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రాజెక్టు కుడి కాలువ 16.10 కిలోమీటర్ల పొడవు ఉండగా 1800 ఎకరాల ఆయకట్టు, ఎడమ కాలువ 17.49 కిలోమీటర్ల పొడవుతో 2500 ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రాజెక్టు సాగు నీటి కాలువల ద్వారా నీరు చివరి వరకు అందితే తంబళ్లపల్లె మండలంలోని 9, పెద్దమండ్యం మండలంలోని 3 చెరువులు జలకళను సంతరించుకుంటాయి. సాగునీటి కాలువల ద్వారా రెండు మండలాల్లోని జుంజురపెంట, బురుజుపల్లె, దండువారిపల్లె, కొటాల, ఎద్దులవారికోట, గొళ్లపల్లె, మండలవారిపల్లె, ఆర్‌ఎన్ తాండా, సూకేనాయక్ తాండా, మంగేనాయక్ తాండా, అవికేనాయక్ తాండా, ఎలుగువారిపల్లె, జరిపాటిదిన్నె, దిగువపల్లె, బోయపల్లె, బండ్రేవు, కొత్తపల్లె, చదివేవాండ్లపల్లె, కొత్తరెడ్డివారిపల్లె, ఇర్లపల్లె, దేనేనాయక్ తాండా తదితర గ్రామాల ఆయకట్టు రైతులకు లబ్ధి చేకూరుతుంది.

అధ్వాన స్థితికి చేరిన సాగునీటి కాలువలు

కొన్నేళ్లుగా పెద్దేరు ప్రాజెక్టు సాగునీటి కాలువల నిర్వహణ కొరవడటంతో వాటి రూపు రేఖలు కోల్పోయి అధ్వాన స్థితికి చేరాయి. కాలువల్లో ఆసాంతం పూడిక నిండిపోయి, జమ్ము, పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. కాలువల గట్ల వెంబడి ముళ్ల పొదలు, చెట్లు పెరిగి చిట్టడివిని తలపించే విధంగా తయారయ్యాయి. కాలువలు మొదలైన దగ్గర నుంచి చివరి వరకు పలుచోట్ల సిమెంటు లైనింగ్ దెబ్బతిని సగం నీరు వృథాగా ఏటికి పోయేది. దీంతో కాలువల్లో నీటి ప్రవాహం తగ్గి సగం ఆయకట్టుకు కూడా నీరందని పరిస్థితి ఉంది. దీంతో రెండు కాలువల కింద శివార్లలో ఉన్న ఆయకట్టు భూములకు నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతూ పంట పెట్టాలంటే వెనుకడుగు వేసేవారు.

రూ.92 లక్షలతో కాలువల ఆధునికీకరణ

కూటమి ప్రభుత్వంలో పెద్దేరు ప్రాజెక్టు సాగునీటి కాలువలకు మహర్దశ పట్టింది. పెద్దేరు ప్రాజెక్టుపై తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డి ప్రత్యేక చొరవ చూపడంతో కాలువల ఆధునికీకరణ పనులకు రూ.92 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో నెల రోజుల నుంచి పెద్దేరు ప్రాజెక్టు చైర్మన్ కొటాల శివకుమార్, కమిటీ సభ్యులు, ఆయకట్టు రైతుల సలహాలు, సూచనలతో కాలువల పనులు జోరుగా జరుగుతున్నాయి. ఇప్పటికే కుడి కాలువ 14 కి.మీ, ఎడమ కాలువ 9 కి.మీ వరకు కాలువల్లో పేరుకుపోయిన పూడిక తొలగించడం, కాలువలకు రెండు వైపులా ఉన్న చెట్లు, ముళ్ల పొదలను తొలగించడం వంటి పనులు పూర్తయినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

నెలాఖరు నాటికి పనులు పూర్తి..

పెద్దేరు ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణకు రూ.92 లక్షలు మంజూరయ్యాయి. కాలువల్లో పూడికతీత, జంగిల్ క్లియరెన్స్, దెబ్బతిన్న లైనింగ్స్‌కు నీరు లీకేజీ కాకుండా కాంక్రీటు వంటి ప్రధాన పనులు చేపడుతున్నాం. తొలుత కాలువల్లో పేరుకుపోయిన పూడికతీత, గట్ల వెంబడి జంగిల్ క్లియరెన్స్ వంటి పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే కుడి కాలువ కింద పనులు దాదాపు పూర్తి కాగా, ఎడమ కాలువ కింద సగానికి పైగా పనులు పూర్తయ్యాయి. ఈ పనులు పూర్తవ్వగానే లీకేజీలు, లైనింగ్ దెబ్బతిన్న చోట కాంక్రీటు పనులు చేపడతాం. చివరి ఆయకట్టు వరకు నీరందించే దిశగా పనులు చేపడతాం. నెలాఖరు నాటికి పనులు పూర్తి చేయడానికి కృషి చేస్తున్నాం.

\- సతీశ్‌రెడ్డి, ఏఈఈ, ఇరిగేషన్

ఆయకట్టు రైతుల కష్టాలు తీరుతాయి..

రైతుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. ప్రాజెక్టు కాలువల ఆధునికీకరణ పనులు పూర్తయితే ఆయకట్టు రైతుల కష్టాలు తీరతాయి. కాలువల ద్వారా ప్రతి ఆయకట్టు భూమికి నీరంది పంటలు బాగా పండుతాయి. ప్రస్తుతం కాలువ పనులు నాణ్యతతో ఆయకట్టు రైతుల సూచనలతో శరవేగంగా జరుగుతున్నాయి. కాలువల ఆధునికీకరణకు ప్రత్యేక చొరవ తీసుకుని నిధుల మంజూరుకు కృషి చేసిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, టీడీపీ ఇంచార్జి జయచంద్రారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు.

\- కొటాల శివకుమార్, సాగు నీటి సంఘం చైర్మన్, పెద్దేరు ప్రాజెక్టు


పనులు చేపట్టక ముందు జమ్ము పెరిగిపోయి కనిపిస్తున్న ఎడమ కాలువ


పనులు చేపట్టిన తర్వాత ఎడమ కాలువ

కువైట్ నుంచి వస్తూ అనంతలోకాలకు...

రోడ్డు ప్రమాదంలో ఇరువురి మృతి


మృతి చెందిన అఫ్గాన్ రఫీఖ్ ఖాన్


బుజ్జమ్మ (ఫైల్)

కలికిరి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కువైట్ నుంచి స్వగ్రామానికి వస్తూ ఆమె కానరాని లోకాలకు వెళ్లిపోయింది. కలికిరి మండలంలోని గుండ్లూరు పంచాయతీ ఈతమానువడ్డెపల్లె వద్ద చిత్తూరు-కడప జాతీయ రహదారిపై గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు మృతి చెందగా మరొకరు స్వల్పంగా గాయపడ్డారు. మృతి చెందిన వారిలో ఒకరు సంబేపల్లె మండలం రౌతుకుంట గ్రామం బోయపల్లెకు చెందిన బుజ్జమ్మ (40) కాగా మరొకరు చిన్నమండెంకు చెందిన అద్దె కార్ల యజమాని అఫ్గాన్ రఫీఖ్ ఖాన్ (58). డ్రైవర్ అజాగ్రత్త కారణంగా ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సంబేపల్లె మండలం రౌతుకుంట పంచాయతీ బోయపల్లె గ్రామానికి చెందిన బుజ్జమ్మ జీవనోపాధి కోసం కువైట్‌లో ఉంటోంది. ఆమె గురువారం కువైట్ నుంచి వస్తుండటంతో ఆమె సమీప బంధువు కొండమోలు గ్రామానికి చెందిన రామలక్ష్మణ్ చిన్నమండెం వెళ్లి రఫీఖ్‌ఖాన్ అనే వ్యక్తి కారు (ఏపీ39డి ఇ0184)ను మాట్లాడుకుని ఇరువురు చెన్నై వెళ్లారు. గురువారం అర్ధరాత్రి ముగ్గురూ అక్కడి నుంచి బయలుదేరారు. రఫీఖ్ ఖాన్ కారు నడుపుతుండగా బుజ్జమ్మ, రామలక్ష్మణ్ వెనుక సీట్లో కూర్చున్నారు. గురువారం ఉదయం 6.30 గంటలకు చిత్తూరు-కర్నూలు హైవేపై వస్తుండగా గుండ్లూరు పంచాయతీ ఈతమానువడ్డెపల్లె వద్ద కారు అదుపు తప్పి రోడ్డుకు పక్కనున్న కల్వర్ట్‌ను ఢీకొనడంతో ముగ్గురు గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో పీలేరు ప్రభుత్వం ఆసుపత్రికి తరలించగా బుజ్జమ్మ, రఫీఖ్‌ఖాన్ పరిస్థితి విషమంగా ఉండటంతో ఇద్దరినీ తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యలో రఫీఖ్‌ఖాన్ మృతి చెందగా తిరుపతి రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సాయంత్రానికి బుజ్జమ్మ కూడా మరణించింది. మృతదేహాలను పరీక్షల కోసం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రామలక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కలికిరి సీఐ రెడ్డిశేఖర్ రెడ్డి పర్యవేక్షణలో హెడ్ కానిస్టేబుల్ పి.మనోహర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా డ్రైవరు అజాగ్రత్త కారణంగానే ప్రమాదం జరిగినట్లు పోలీసులు గుర్తించారు. బుజ్జమ్మకు భర్త, పిల్లలు లేరు. రఫీఖ్‌ఖాన్‌కు భార్య, ఒక కొడుకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

'పది' పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించండి

- మార్చి 17 నుంచి 31 వరకు పరీక్షలు
- 121 కేంద్రాలు.. 22,335 మంది విద్యార్థులు
- జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో మధుసూదన్‌రావు

రాయచోటి (కలెక్టరేట్), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి పరీక్షలను నిర్దిష్టమైన ప్రణాళికతో ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో డీఆర్వో అధ్యక్షతన పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మార్చి 17 నుంచి 31వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. జిల్లాలోని 121 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 22,355 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు చెప్పారు. ఇందులో రెగ్యులర్ విద్యార్థులు 22,050 మంది, ఫెయిల్ అయిన విద్యార్థులు 305 మంది పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. అలాగే మార్చి 17 నుంచి 28వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటలవరకు ఓపెన్ స్కూల్ విద్యార్థులు 834 మందికి కూడా 19 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు, టాయిలెట్స్, తాగునీరు, ఫ్యాన్లు, లైట్లు వెంటిలేషన్ అన్నీ సక్రమంగా ఉండేలా ముందస్తుగా పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రెవెన్యూ, పోలీసు, రవాణాశాఖ, మెడికల్, విద్యుత్, పోస్టల్‌శాఖలు వారికి సంబంధించిన విధులను బాధ్యతగా నిర్వర్తించి పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంతరాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈనెల 15లోగా రూట్ ఆఫీసర్లను, జాయింట్ కస్టోడియన్లను నియమించాలని, అలాగే 26లోగా ఇన్విజిలేటర్ల నియామకాలు పూర్తి చేయాలని విద్యాశాఖాధికారులకు సూచించారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి మొబైల్ ఫోన్స్ తీసుకునిరాకూడదని తెలిపారు. సమావేశంలో డీఈవో సుబ్రమణ్యం, డిప్యూటీ డీఈవో శివప్రకాశ్‌రెడ్డి, విద్యుత్‌శాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, డీసీఆర్వో పురుషోత్తం, వైద్య, ఖజానా, పోలీసు, రెవెన్యూ, ఆర్టీసీ, రవాణా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఫటాఫట్

జిల్లాలో సెలెక్ట్ గ్రేడ్ మున్సిపాలిటీగా ఉన్న మదనపల్లెలో వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నాం. పట్టణంలో ఇప్పటి వరకూ ఎక్కడా నీటి సమస్య ఉన్నట్లు ప్రజల నుంచి ఫిర్యాదులు రాలేదు. ఒకవేళ రానున్న రోజుల్లో ఎండలు తీవ్రమై..తాగునీటి పథకాల్లో నీరు తగ్గినా, బోరు మోటార్లు మరమ్మతుకు గురైనా ఎప్పటికప్పుడు ఎదుర్కోవడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. తాగునీటి సరఫరాపై వేసవి దృష్ట్యా ఎదురయ్యే సమస్యలపై కమిషనర్ ప్రమీలతో ఆంధ్రజ్యోతి ఫటాఫట్ ఇంటర్వ్యూ.

\- మదనపల్లె (ఆంధ్రజ్యోతి)

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

- మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల



ప్రశ్న: వేసవిని ఎదుర్కోవడానికి మీ ప్రణాళిక ఏంటి?

కమిషనర్: రానున్న వేసవిని ఎదుర్కోడానికి అన్ని శాఖల అధికారులు, పాలకవర్గం ముందస్తు చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికైతే పట్టణంలో ఎక్కడా నీటి సమస్య లేదు. ఒకవేళ వస్తే..ఎక్కడ వస్తుందో కూడా గుర్తించాం. ఇందులో భాగంగా ఇప్పటికే ఒకటి, రెండు వార్డుల్లో పదిబోర్లు వేయాలని నిర్ణయించాం. ఆ అంశాన్ని కౌన్సిల్ దృష్టికి కూడా తీసుకెళ్లి అనుమతి కూడా తీసుకున్నాం.

ప్రశ్న: సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

కమిషనర్: పట్టణంలో తాగునీటి పథకాల బోర్లు ఎండిపోయినా, మోటార్లు రిపేరు వచ్చినా..దానికి సంబంధించిన సామగ్రి లేక మరమ్మతులు చేయడానికి కొంత సమయం పట్టేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. చేతిపంపుల మెటీరియల్, మోటార్లు, ప్యానల్ బోర్డుల సామగ్రి సిద్ధంగా ఉంది.

ప్రశ్న: నీటి సమస్య తీవ్రమైతే పరిస్థితి ఏంటి?

కమిషనర్: రానున్న రోజుల్లో ఎండలు తీవ్రమై నీటి సమస్య వస్తే..ఉన్న బోర్లను డీపెనింగ్ చేసి అదనపు పైపులు దించుతాం. కొన్నిచోట్ల కొత్తబోర్లు తవ్వుతాం. అక్కడికీ సమస్య పరిష్కారం కాకుంటే.. అంతిమంగా ప్రైవేటు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తాం. ఇందుకు సంబంధించి పట్టణంలోని 12ఓవర్‌హెడ్, జీఎల్‌ఆర్ ట్యాంకుల పరిధిని నాలుగు క్లస్టర్లుగా విభజించి ట్యాంకర్లతో సంపులకు పంపింగ్ చేసి అక్కడి నుంచి ఓవర్‌హెడ్‌లను నింపి పైపులైన్లకు సరఫరా చేస్తాం. ఇందుకోసం కౌన్సిల్ అనుమతి కూడా తీసుకున్నాం.

ప్రశ్న: సమస్య మొదలయ్యే ప్రాంతాలు?

కమిషనర్: పట్టణంలోని 35 వార్డుల్లోనూ ఏరియాను బట్టి మూడు నుంచి అయిదురోజుల కోసం నీటి సరఫరా చేస్తున్నాం. సమస్య మొదలైతే..మొదటగా రామారావుకాలనీ, రామిరెడ్డిలేవుట్, అమ్మచెరువుమిట్ట ఏరియాలలో మొదలవుతుంది. ఈ ఏరియాలలో ఇప్పటికే ఎనిమిది బోర్లు కూడా వేయించి నీటిని వినియోగంలోకి తెచ్చాం. వేంపల్లె హెడ్ వాటర్ వర్క్స్ నుంచి పీఅండ్‌టీ కాలనీలోని సంపునకు, అక్కడి నుంచి నక్కలదిన్నె ఏరియాలకు సరఫరా చేసేవాళ్లం. అక్కడి నీటిని ఇంతవరకు తీసుకుని రాకుండా, అక్కడి నీటిని అక్కడే వినియోగించుకునేలా రూ.1.35 కోట్లతో నక్కలదిన్నెలో జీఎల్ఎస్ ట్యాంకు నిర్మాణానికి చర్యలు చేపట్టాం.

ప్రశ్న: చేతిపంపుల పరిస్థితి మాటేంటి?

కమిషనర్: పట్టణంలో గతంలో తవ్వించిన చేతిపంపులు 135 వరకు ఉన్నాయి. ప్రస్తుతం అందులో వందకుపైగా పనిచేస్తున్నాయి. ఇవన్నీ గతంలో తవ్వించినవే. కొళాయిల ద్వారా నీటి సరఫరా లేని, ఎక్కడైనా తాగునీటి పథకాలు మరమ్మతుకు గురైనప్పుడు మాత్రమే ప్రజలు వీటిని వినియోగిస్తున్నారు. ఎక్కువ నీరు లభ్యం కాని ప్రాంతాల్లో తాగునీటి పథకాలను చేతిపంపులుగా ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నాం. వీటి నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తూ, సామగ్రి సిద్ధం చేశాం.

పీలేరు మండలం తలపులలో అక్రమ నిర్మాణం కూల్చివేతను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్



అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం

6

- పలు నిర్మాణాల కూల్చివేత
- కూల్చివేతలను స్వయంగా పర్యవేక్షించిన కలెక్టర్
- ప్రభుత్వ భూములను చెరబడితే కఠిన చర్యలు
- కలెక్టర్ చర్యలతో అక్రమార్కుల గుండెల్లో గుబులు

ఇంతకాలం ప్రభుత్వ భూముల ఆక్రమణ, అక్రమ నిర్మాణాల అడ్డగింత, అక్రమార్కులకు హెచ్చరికలు, ఆ స్థలాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు వంటివి మాత్రమే చూసిన పీలేరు ప్రజలకు తొలిసారిగా రెవెన్యూ యంత్రాంగం పవర్ తెలిసింది. ప్రభుత్వ భూముల్లో వెలసిన అక్రమ నిర్మాణాల కూల్చివేతకు స్వయంగా కలెక్టర్ చామకూరి శ్రీధర్ రంగంలోకి దిగడంతో పీలేరు ప్రజలకు సరికొత్త అనుభవం ఎదురైంది. అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని ఆదేశాలు జారీ చేయడమే కాకుండా కూల్చివేతలను ఆయనే స్వయంగా పర్యవేక్షించారు. ఆక్రమణలన్నీ తొలగిపోయాయి అని తెలుసుకున్న తరువాతనే అక్కడి నుంచి కదిలారు. కలెక్టర్ చర్యలతో పీలేరు ప్రాంతంలోని సామాన్యులు హర్షం వ్యక్తం చేస్తుండగా అక్రమార్కుల గుండెల్లో ఆందోళన మొదలైంది.

ఆస్పత్రిలో పసికందు మృతి

- ప్రైవేట్ డాక్టర్‌పై కేసు నమోదు


మృతి చెందిన చిన్నారి

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పసికందు మృతిపై వైద్యులు, సిబ్బందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు, బాధితుల కథనం మేరకు..మదనపల్లె మండలం వేంపల్లె హరిజనవాడకు చెందిన స్వాతి, చీనేపల్లె వెంకటేశ్‌కు నాలుగేళ్ల క్రితం వివాహమైంది. వీరికి 14 రోజుల క్రితం మగశిశువు జన్మించాడు. మండలంలోని బొమ్మనచెరువు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సాధారణ జననం కాగా, శిశువు సాధారణ బరువు కంటే తక్కువగా ఉండటంతో అక్కడి వైద్యులు మదనపల్లె జిల్లా ఆసుపత్రికి రెఫర్ చేశారు. అనంతరం అక్కడి నుంచి నాలుగురోజుల క్రితం స్థానిక అమ్మినేనివీధిలోని సీటీ హాస్పిటల్‌లో చేరారు. ఇక్కడి వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న పసికందు బుధవారం సాయంత్రం మృతి చెందాడు. అయితే వైద్యులు మాత్రం పసికందు బతికే ఉన్నాడని కుటుంబీకులకు చెబుతూ వచ్చారు. దీనిపై అనుమానం వచ్చిన కుటుంబీకులు వైద్యులు, సిబ్బందిని నిలదీసి ఆసుపత్రి ఎదుట ఆందోళన చేయడంతో చిన్నారి పరిస్థితి విషమంగా ఉందని వేరే ఆసుపత్రిలో చూపించుకోవాలని చెప్పడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం వైద్యులు వెంటిలేటర్ తొలగించడంతో అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. చిన్నారి తల్లిదండ్రులు అప్పటివరకు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం రూ.40 వేలు బిల్లు చెల్లించారు. బాధితుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ ఎరిసావలి కేసు నమోదు చేశారు. పసికందు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఇందులో భాగంగా గురువారం మధ్యాహ్నం పసికందు మృతదేహానికి వైద్యుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితులు జిల్లా ఆసుపత్రిలో మాట్లాడుతూ తొలికాన్పులో జన్మించిన మగ బిడ్డను వైద్యులు నిర్లక్ష్యంతో చంపేశారని ఆరోపించారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, తల్లి రోదించడం చూపరులను కంటతడి పెట్టించింది.

సర్వే కష్టాలు

- సర్టిఫికెట్ కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- సర్వే సర్టిఫికెట్ లేనిదే రిజిస్ట్రేషన్ చేయనంటున్న సబ్ రిజిస్ట్రార్లు
- మండల సర్వేయర్ పరిధిలో పొందవచ్చని అంటున్న తహశీల్దార్లు
- గగ్గోలు పెడుతున్న ప్రజలు



రైల్వేకోడూరు తహశీల్దార్ కార్యాలయం


పుల్లంపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

రైల్వేకోడూరు రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సర్వే సర్టిఫికెట్ల కోసం చాలామంది బాధితులు ఎవరు ఇస్తారో అర్థం కాక అటు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఇటు రెవెన్యూ కార్యాలయానికి ప్రదక్షిణలు చేస్తూ అష్టకష్టాలు పడుతున్నారు. ఏం చేయాలో దిక్కుతోచక గగ్గోలు పెడుతున్నారు. సర్వే సర్టిఫికెట్ మండల సర్వేయర్ పరిధిలో పొందవచ్చని తహసీల్దార్లు అంటున్నా... తహశీల్దార్లు సర్టిఫికెట్ ఇస్తేనే రిజిస్టర్ చేస్తామని పుల్లంపేట, చిట్వేల్ సబ్ రిజిస్ట్రార్లు చెబుతున్నారు. ముఖ్యంగా సర్వే సర్టిఫికెట్లు, అనుభవం సర్టిఫికెట్లు ఇచ్చేందుకు రెవెన్యూ అధికారులు ఏమాత్రం సుముఖంగా లేరు. గతంలో జరిగిన పొరపాట్లు వలన తహశీల్దార్లు ఇబ్బందులకు గురికావడంతో పై అధికారుల ఆదేశాల మేరకు సర్టిఫికెట్లు జారీ చేయలేమని చెబుతున్నారు.

గతంలో ఇంటి స్థలం డాక్యుమెంట్లు ఉంటే రిజిస్టర్ అవుతుండేవి. కానీ ఇప్పుడు డాక్యుమెంట్‌లో సర్వే నెంబర్ లేదని రెవెన్యూ అధికారుల వద్ద సర్టిఫికెట్ తెచ్చుకోవాలని సబ్ రిజిస్ట్రార్లు చెబుతున్నారు. మండల సర్వేయర్ సర్టిఫికెట్లు మంజూరు చేసినా రిజిస్టర్ ఎందుకు చేయడం లేదని బాధితులు సబ్ రిజిస్ట్రార్లను ప్రశ్నిస్తున్నారు. తహసీల్దార్ సర్టిఫికెట్ ఇస్తేనే రిజిస్టర్ చేస్తామని తెగేసి చెబుతున్నారు. డాక్యుమెంట్లు లేకుండా కేవలం సర్వే సర్టిఫికెట్‌పై రిజిస్టర్ చేస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. కేవలం సర్వే సర్టిఫికెట్లు లేకపోవడంతో పుల్లంపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వందల డాక్యుమెంట్లు నిలిచిపోయాయి. దీని వలన ప్రభుత్వానికి వచ్చే ఆదాయం భారీగా తగ్గడంతో పాటు బాధితులు ఇబ్బందులు పడుతున్నారు. సర్వే సర్టిఫికెట్ల కోసం బాధితులు రెవెన్యూ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తమ సమస్యకు పరిష్కారం ఏంటని బాధితులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. అధికారులు స్పందించకుంటే ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి గండి పడే అవకాశం ఉంది.

సర్వే సర్టిఫికెట్ ఎందుకు ?

ఇంటి స్థలం డాక్యుమెంట్లు అన్నీ సక్రమంగా ఉన్నా సర్వే సర్టిఫికెట్ ఎందుకని పలువురు ప్రశ్నిస్తున్నారు. గతంలో రిజిస్టర్ అయిన డాక్యుమెంట్లకు సర్వే నెంబర్ లేనందున రెవెన్యూ కార్యాలయంలో సర్టిఫికెట్ తీసుకోవాలని సబ్ రిజిస్ట్రార్లు చెబుతున్నారు. ఇంటి స్థలం డాక్యుమెంట్‌పై సర్వే సర్టిఫికెట్ పొందాలంటే మండల సర్వేయర్‌కు వినతిపత్రం ఇవ్వాలి. గ్రామ సర్వేయర్ సహకారంతో మండల సర్వేయర్ సర్వే నిర్వహించి బాధితులకు సర్టిఫికెట్లు అందజేస్తారు. ఇందులో తహశీల్దార్ ప్రమేయం ఎంతవరకు ఉండదు. మండల సర్వేయర్ మంజూరు చేసిన సర్టిఫికెట్‌పై తహసీల్దార్ సంతకం లేనిదే రిజిస్టర్ చేయలేమని పుల్లంపేట, చిట్వేలి సబ్ రిజిస్ట్రార్లు బాధితులను కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారు. డాక్యుమెంట్ సక్రమంగా ఉన్నా కూడా అవి లేవని.. ఇవి లేవని పుల్లంపేట సబ్ రిజిస్ట్రార్ బాధితులను కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారని పలు ఆరోపణలు ఉన్నాయి.

మా ప్రమేయం ఉండదు

ఇంటి స్థలాల డాక్యుమెంట్ సర్వేపై మా ప్రమేమం ఉండదు. మండల సర్వేయర్ సర్వే నిర్వహించి సర్టిఫికెట్ మంజూరు చేస్తారు. కేవలం ప్రభుత్వ, వ్యవసాయ భూములకు మాత్రమే మేము సర్టిఫికెట్ మంజూరు చేస్తాము. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇంటి స్థలాల రిజిస్టర్ డాక్యుమెంట్లపై సర్వే సర్టిఫికెట్ ఇవ్వలేము. డాక్యుమెంట్లు పరిశీలించకుండా మేము ఇచ్చే సర్టిఫికెట్లపై ఎలా రిజిస్టర్ చేస్తారు. కార్యాలయానికి వచ్చే ప్రజలకు వారికి కావాల్సిన పత్రాలపై సరైన అవగాహన కల్పించాలి. తహసీల్దార్లపై విమర్శలు చేయడం తగదు.

\- షేక్ మహబూబ్ చాంద్,
తహశీల్దార్, రైల్వేకోడూరు

సర్వే నెంబర్ లేనిదే రిజిస్ట్రేషన్ చేయలేము

గతంలో పట్టణంలో డోర్ నెంబర్, హద్దుల వివరాల మేరకు రిజిస్ట్రేషన్ చేసేవారం. కానీ ఇప్పుడు డాక్యుమెంట్లలో సర్వే నెంబర్ లేనిదే రిజిస్ట్రేషన్ చేయలేము. సర్వే నెంబర్ సర్టిఫికెట్‌పై స్థానిక తహశీల్దార్ సంతకం తప్పనిసరిగా ఉండాలి. మాపై జిల్లా అధికారుల ఆదేశాల ఉన్నాయి. అన్ని పత్రాలు సక్రమంగా ఉంటేనే రిజిస్ట్రేషన్ చేస్తాము.

\- షేక్ మహమ్మద్ రఫీ,
సబ్‌రిజిస్ట్రార్, పుల్లంపేట

నాకు న్యాయం ఎలా జరుగుతుంది ?



నేను సంపాదించిన ఆస్తిని నా కుమారుడి పేరుతో రిజిస్టర్ చేయడానికి పుల్లంపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాను. అక్కడ నా డాక్యుమెంట్లు పరిశీలించి సర్వే నెంబర్ లేదని, తహశీల్దార్ వద్ద తీసుకుని రావాలని సబ్ రిజిస్ట్రార్ తెలిపారు. కానీ తహశీల్దార్ వద్దకు వెళితే మండల సర్వేయర్ వద్ద తీసుకోవాలని తెలిపారు. సర్వేయర్ ఇచ్చిన సర్టిఫికెట్‌పై తహశీల్దార్ సంతకం చేస్తేనే రిజిస్టర్ చేస్తామని సబ్ రిజిస్ట్రార్ తెలిపారు. గతంలోని డాక్యుమెంట్లు పరిశీలించిన తరువాతే రిజిస్ట్రేషన్ చేస్తామని చెబుతున్నారు. ఇప్పుడు నా సమస్యకు పరిష్కారం ఏమిటి.

\- సయ్యద్ ఉస్మాన్, రైల్వేకోడూరు

రూ.5.7 కోట్లతో వాటర్‌షెడ్ పనులు

- డ్వామా పీడీ వెంకటరత్నం


వాటర్‌షెడ్ సభ్యులకు మెమెంటో, ప్రశంసాపత్రాలను అందిస్తున్న ఏపీడీ

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): బి.ఎర్రగుడి వాటర్ షెడ్ ప్రాజెక్టు కింద ఐదు మైక్రోవాటర్‌షెడ్ గ్రామాల్లో 4911 హెక్టార్లల్లో రూ.5.7 కోట్లతో వాటర్‌షెడ్ పనులు మంజూరయ్యాయని డ్వామా పీడీ వెంకటరత్నం పేర్కొన్నారు. బుధవారం కోనంపేట, జాండ్రపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో వాటర్‌షెడ్ యాత్రపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కోనంపేట పంచాయతీలోని రూ.3.82 లక్షలతో చెక్ డ్యామ్ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పీడీ మాట్లాడుతూ మండలంలో బి.ఎర్రగుడి వాటర్‌షెడ్ ప్రాజెక్టు దిన్నెపాడు, బి.ఎర్రగుడి, కోనంపేట, దప్పేపల్లె పాళెంగొల్లపల్లె గ్రామాల్లో సుమారు 4911 హెక్టార్లతో ఎన్ఆర్ఎం (సహజవనరుల అభివృద్ధి పథకం) కింద గ్రామాల్లో పనులు చేపడుతామని ఆయన అన్నారు. ఈ ఐదు గ్రామాల్లో నీరు నిల్వ నీటిగుంతలు, పారంపాండు పనులు, డకోట్ పనులు చేపట్టి సహజవనరులను కాపాడుకోవాలని ఆయన అన్నారు. ఈ 5 గ్రామాలను ఐదేళ్లలో పనులు పూర్తి చేస్తే రైతులు, గ్రామాలు సస్యశ్యామలంగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. టీడీపీ మండల ఇన్‌చార్జ్ యనమల మదన్‌మోహన్ మాట్లాడుతూ వాటర్‌షెడ్ పనులను దుర్వినియోగం చేయకుండా పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం హైస్కూల్ విద్యార్థులచే ర్యాలీ నిర్వహించి వాటర్‌షెడ్ మెంబర్లకు మెమెంటో, ప్రశంసాపత్రాలను అందజేసి పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉపాధి క్లస్టర్ ఏపీడీ నందకుమార్‌రెడ్డి, వాటర్‌షెడ్ ఏపీడీ లక్ష్మినరసయ్య, పీఓ వెంకటరామిరెడ్డి, కోనంపేట సర్పంచు లక్ష్మినారాయణ, వాటర్‌షెడ్ రమణ, ఉపాధి ఇన్‌చార్జ్ ఏపీవో వెంకటపతి, సభ్యులు కొనసాని రాజారెడ్డి, దిన్నెపాడు పెద్దచెరువు ఛైర్మన్ మోహన్‌రెడ్డి, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

మల్లయ్యకొండ అడవికి నిప్పు


అడవిలో చెలరేగుతున్న మంటలు

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్యకొండ అటవీ ప్రాంతాలు అగ్నికి ఆహుతవుతున్నాయి. గురువారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు కొండ కింద దక్షిణ అటవీ భాగంలో నిప్పుపెట్టడంతో అవి పెద్ద ఎత్తున చెలరేగి సాయంత్రానికి క్రమంగా మల్లయ్యకొండకు వ్యాపించాయి. దీంతో మల్లయ్యకొండ అటవీ ప్రాంతంలో ఉన్న బద్రోళ్లగుట్ట, చింతల పులకోన, జంగంమూల, మిరపచెట్లదిన్నె తదితర ప్రాంతాలు కలిపి సుమారు 500 హెక్టార్ల వరకూ అగ్నికి ఆహుతి అయినట్లుగా తెలుస్తోంది. వందల ఎకరాల్లో అడవి కాలిపోవడంతో పలు రకాల జాతులకు చెందిన వృక్షసంపద, వన్యప్రాణులు మంటలకు మాడి మసైపోయాయి. మల్లయ్యకొండ, ఇనుముకొండల్లో దొరికే ఉసిరి, బిక్కి, ఈత, నేరేడు, తదితర ఫలాలను పలువురు స్థానికులు, గిరిపుత్రులు విక్రయించుకొని జీవనోపాధి పొందుతున్నారు. అయితే, కొంత మంది ఆకతాయిలు అడవులకు నిప్పు పెట్టడం వలన ఏళ్ల నాటి విలువైన వృక్ష సంపద కాలిపోయి జీవనోపాధి కోల్పోతున్నారు. కాగా, మల్లయ్యకొండ అటవీ ప్రాంతంలో చెలరేగిన అగ్ని కీలలు క్రమంగా సమీప పొలాల్లో ఉన్న వేరుశనగ, మామిడి తోటలకు మంటలు వ్యాపించాయి. దీంతో స్థానిక రైతులు తీవ్రంగా కృషిచేసి పొలాల్లోకి వ్యాపించిన మంటలను ఆర్పివేశారు. మంటలను ఆర్పడానికి ప్రయత్నిస్తున్నట్లు ఫారెస్ట్ ఎఫ్‌బీవో రామరాజు తెలిపారు.

కూలీలకు 150 రోజులు పనులు కల్పించాలి

రామాపురం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలాన్ని కరువు మండలంగా ప్రభుత్వం ప్రకటించినందున జాతీయ ఉపాధి హామీ పథకంలో 150 రోజులు ఉపాధి పనులు కల్పించాలని జిల్లా ఉపాధి పీడీ వెంకటరత్నం పేర్కొన్నారు. మండలంలోని చిట్లూరు గ్రామంలోని పెద్దచెరువులో ఉపాధి పనులను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిట్లూరు గ్రామంలో 225 మంది కూలీలు పనిచేస్తున్నారని, మండల వ్యాప్తంగా 2200 పైగా కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారని, ఉపాధి పనులను నాణ్యతగా పనులు చేపట్టాలన్నారు. జిల్లాలో 58 వేల మంది కూలీలు పనిచేస్తున్నారని, జిల్లా వ్యాప్తంగా రైతులు 38 వేల ఎకరాల్లో పండ్ల తోటలను 2024-25 సంవత్సరంలో పెంపకం చేపట్టామన్నారు. రైతులు తమ పొలాల్లో ఫారంపాండు పనులు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో పెంచలయ్య, ఈసీ శివయ్య, టీఏలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురు తహశీల్దార్ల బదిలీ

మదనపల్లె, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో డిప్యుటేషన్‌పై ముగ్గురు తహశీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో గతంలో నిమ్మనపల్లె తహశీల్దార్‌గా పనిచేసిన కె.ధనంజయులు మదనపల్లెకు, నందలూరులో పనిచేస్తున్న తహశీల్దార్ కె.అమర్‌నాథ్‌ను నిమ్మనపల్లెకు బదిలీ చేశారు. అలాగే కలెక్టరేట్‌లోని ఎన్నికల విభాగంలో పనిచేస్తున్న పి.నరసింహకుమార్‌ను రాయచోటి ఇన్‌చార్జ్ తహశీల్దార్‌గా నియమించారు. రాయచోటిలో పనిచేస్తున్న పుల్లారెడ్డిని నందలూరుకు బదిలీ చేశారు. అలాగే గతంలో మదనపల్లెలో పనిచేస్తూ ప్రస్తుతం సెలవులో ఉంటున్న ఎస్.ఖాజాబీని సెలవు పూర్తయ్యాక పోస్టింగ్ కోసం కలెక్టరేట్‌లో రిపోర్ట్ చేసుకోవాలని కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈమెను మదనపల్లె నుంచి పది రోజుల క్రితం కలెక్టర్ నిమ్మనపల్లెకు బదిలీ చేయగా విధుల్లో చేరకుండా సెలవులో వెళ్లారు.

ఎంపీ మిథున్‌రెడ్డి రాజీనామా చేయాలి

- రాజంపేట పార్లమెంటు బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేశ్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్

రాజంపేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): భూకబ్జాదారులు, అటవీభూముల ఆక్రమణదారులు, అవినీతిపరులైన ఎంపీ మిథున్‌రెడ్డి కుటుంబం వెంటనే తమ పదవులకు రాజీనామా చేసి రాజకీయాల నుంచి వైదొలగాలని రాజంపేట పార్లమెంటు బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేశ్ డిమాండ్ చేశారు. గురువారం రాజంపేట బీజేపీ పార్లమెంట్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఎంపీ మిథున్‌రెడ్డి పదేళ్లు ఎంపీగా, గత జగన్ ప్రభుత్వంలో అధికార పార్టీ నేతగా వారి తండ్రి మంత్రిగా, చిన్నాన్న ఎమ్మెల్యేగా, ముగ్గురుండి ప్రజలకు చేసిన మేలంటూ ఏమీ లేదని, రాష్ట్రం అటుంచి కనీసం రాజంపేట పార్లమెంటును కూడా అభివృద్ధి చేసుకోలేని అభివృద్ధి నిరోధకులు అని ఎద్దేవా చేశారు. వీరు అధికారంలో భూకబ్జాలకు, అటవీ భూముల ఆక్రమణలకు, అనేక స్కాంలకు పాల్పడి వేల కోట్లు సంపాదించారని ఆరోపించారు. కాగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిపై, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌పై ఎంపీ మిథున్‌రెడ్డి అనుచిత పదజాలాన్ని ఉపయోగించి పార్లమెంట్‌లో విమర్శించడాన్ని తాము తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. వెంటనే బీజేపీ నేతలకు ఎంపీ మిథున్‌రెడ్డి క్షమాపణ చెప్పాలన్నారు. రాజంపేట ప్రాంతంలో ఎన్నో ఏళ్లుగా ఆగుతున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లు కరోనా నుంచి ఆపకపోతే వాటిని ఆపించుకోలేని మిథున్‌రెడ్డి ఏం అభివృద్ధి చేస్తారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మైనార్టీ మోర్చ ఉపాధ్యక్షుడు షబ్బీర్‌అహ్మద్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రిష్ణయాదవ్, తోట రేవంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు
దరఖాస్తుల ఆహ్వానం

కలికిరి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మహాత్మజ్యోతీబా పూలే బీసీ గురుకుల పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ జారీ అయ్యింది. బీసీ గురుకుల జూనియర్ కళాశాలో ఇంటర్మీడియట్, పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు పంపుకోవాలని కలికిరి బాలికల బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనరు వై.సోమశేఖర్ తెలిపారు. అంతేగాకుండా 6, 7, 8, 9వ తరగతుల్లో అందుబాటులో ఉన్న బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం కూడా దరఖాస్తులు పంపుకోవచ్చని తెలిపారు. చిత్తూరు జిల్లాలోని సదుం బాలుర జూనియర్ కళాశాలతోపాటు సదుం, కుప్పం (బాలురు), పెద్దపంజాణి, పులిచెర్ల (బాలికలు) బీసీ గురుకుల పాఠశాలల్లోనూ, తిరుపతి జిల్లాలోని సత్యవేడు, ఐతేపల్లె (బాలురు) ఉదయమాణిక్యం (బాలికలు) పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు పంపుకోవా లన్నారు. అదే విధంగా అన్నమయ్య జిల్లాకు సంబంధించి తంబళ్లపల్లె (బాలురు), కలికిరి, పీలేరు (బాలికలు) పాఠశాలల్లో కూడా ప్రవేశాలున్నాయని సోమశేఖర్ వివరించారు. వీటన్నిటిలోనూ అందుబాటులో ఉండే బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం కూడా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఈ నెల 15 నుంచి మార్చి 15వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని కోరారు. ఆయా పాఠశాలలు, కళాశాలల వారీ అందుబాటులో ఉన్న సీట్ల వివరాలు కూడా ఆన్‌లైన్ ఉన్నాయని తెలిపారు. జూనియర్ ఇంటర్ ప్రవేశాలకు ఏప్రిల్ 20న, 5వ తరగతి ప్రవేశాలకు 27న, బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి 28న ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థుల తల్లిదండ్రుల ఆదాయం రూ.లక్షకు మించకూడదన్నారు. సంబంధిత జిల్లాలోని ప్రభుత్వ లేదా ప్రైవేటు పాఠశాలల్లో చదవుతూ ఉండాలన్నారు. ఇతర వివరాలు లేదా సందేహాల కోసం 90007 15637. 87900 92069, లేదా 79894 45396 నంబర్లలో సంప్రదించాలని కన్వీనరు సోమశేఖర్ కోరారు.

శ్రీరామ ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధరిస్తాం

- టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు


మినీ గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట చెరువుకు నీరందించే శ్రీరామ ఎత్తిపోతల పథకాన్ని రూ.11 కోట్లతో మరమ్మతులు చేయించి శాశ్వతంగా ఇనుప పైపులు వేయించి చెరువుకు శాశ్వతంగా నీరందించేలా చేస్తామని, ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని, రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలి పారు. ఒంటిమిట్ట మండలం చిన్నకొత్తపల్లె గ్రామంలో మినీ గోకులాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒంటిమిట్ట మండలం అంటే సీఎం చంద్రబాబు నాయుడుకు ఎంతో ఇష్టమని, అందువల్లే గతంలో ఒంటిమిట్ట కోదండ రామాలయాన్ని రాష్ట్ర భద్రాద్రిగా ప్రకటించి రూ.100 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారన్నారు. త్వరలో నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, సీఎం చంద్రబాబుతో మాట్లాడి వెంటనే శ్రీరామ ఎత్తిపోతల పథకానికి నిధులు విడుదల చేయిస్తామన్నారు. మండల టీడీపీ సీనియర్ నాయకులు, రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చిన్నకొత్తపల్లె గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకులు కట్టా సుబ్బరాయుడు, కట్టా వెంకటరమణ, ఎంపీడీవో ప్రసాద్, ఏపీవో శివశంకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సుబ్బమ్మ, మహబూబ్‌బాషా, సర్పంచ్ మామిళ్ల శ్రీహరి, ఈశ్వరయ్య, న్యాయవాది రామదాసు తదితరులు పాల్గొన్నారు.

దర్గాను సందర్శించిన సినిమా డైరెక్టర్ కృష్ణవంశీ


కృష్ణవంశీకి పుస్తకాన్ని అందజేస్తున్న సత్యమయ్య స్వామి

రామాపురం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలకంఠ్రావుపేట పంచాయతీ శ్రీసాయినగర్‌లో వెలసిన శ్రీసద్గురు దర్గా మాతాజీలను గురువారం సినిమా డైరెక్టర్ కృష్ణవంశీ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన దర్గా స్వామిని, దర్గా మాతాజీని గుర్తు చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామిజీ భక్తుడు సత్యమయ్య శ్రీదర్గా స్వామీజీ జీవిత చరిత్రకు సంబంధించిన బుక్స్‌ను వారికి అందజేశారు.

అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం

- పలు నిర్మాణాల కూల్చివేత
- కూల్చివేతలను స్వయంగా పర్యవేక్షించిన కలెక్టర్
- ప్రభుత్వ భూములను చెరబడితే కఠిన చర్యలు
- కలెక్టర్ చర్యలతో అక్రమార్కుల గుండెల్లో గుబులు



పీలేరు-తిరుపతి రోడ్డులోని హెరిటేజ్ డెయిరీ వద్ద ఉన్న అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న రెవెన్యూ సిబ్బంది

పీలేరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణంలో పేట్రేగిపోతున్న అక్రమార్కుల భరతం పట్టాలన్న లక్ష్యంతో గురువారం కలెక్టర్ చామకూరి శ్రీధర్ పీలేరుకు వచ్చారు. పీలేరుకు వచ్చీ రావడంతోనే స్థానిక నాగిరెడ్డి కాలనీలోని సర్వే నెం.72/2లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను పరిశీలించి నిర్మాణదారులను సుతిమెత్తగా హెచ్చరిస్తూనే రెవెన్యూ అధికారులకు సహకరిస్తే భవిష్యత్తులో ఏదైనా సాయం చేస్తానని భరోసా కల్పించారు. దీంతో అప్పటి వరకు అక్కడి నుంచి కదలడానికి ససేమిరా అన్న నిర్మాణదారులు స్వచ్ఛందంగా తప్పుకున్నారు. వారి రికార్డులు పరిశీలించి వివాదాస్పదం కాకుంటే ప్రభుత్వ నిబంధనల మేరకు వారి భూమిని క్రమబద్ధీకరించమని తహసీల్దారు భీమేశ్వర రావును ఆదేశించారు. అక్కడి నుంచి పీలేరు-తిరుపతి మార్గంలోని ఎర్రగుంటపల్లె పంచాయతీ సర్వే నెం.741లో వెలసిన అక్రమ నిర్మాణాల వైపు కదిలారు. తన వెంట ఎక్స్‌కవేటర్ పెట్టుకున్న ఆయన స్థానిక అధికారులను వాటిని కూల్చివేయాలని ఆదేశించారు. ఆ సర్వే నెంబరులో ఉన్న మూడు అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ఇక అక్కడి నుంచి తలపుల గ్రామం సమీపంలో ఉన్న ఉలవల గంగమ్మ గుట్టలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ, అటవీ, పొరంబోకు భూములను పరిశీలించారు. రెవెన్యూ రికార్డులు పరిశీలించి అవి ఆక్రమణకు గురయ్యాయని నిర్ధారించుకున్న తరువాత వాటిని సైతం కూల్చివేయమన్నారు. కూల్చివేతలను స్వయంగా దాదాపు మూడు గంటలసేపు ఎండలో నిలబడి మరీ పర్యవేక్షించారు. దాదాపు 18 ఎకరాల భూమి అన్యాక్రాంతం అయిపోతున్నా ఇన్నాళ్లూ ఎందుకు పట్టించుకోలేదంటూ స్థానిక సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ భూముల్లో వెలసిన ఇళ్లు, చుట్టూ వేసిన కంచె, ఏర్పాటు చేసుకున్న ట్రాన్స్‌ఫార్మర్లు, నీటి బోర్లను సైతం తొలగింపజేశారు. అనంతరం తిరుగుప్రయాణంలో పీలేరు-కోటపల్లె మార్గంలో నిర్మితమవుతున్న ఓ బహుళ అంతస్థుల భవంతిని సైతం కూల్చి వేయించారు. సాధారణంగా అక్రమ నిర్మాణాలను గుర్తించిన అనంతరం చర్యలు తీసుకోవాలని ఆదేశించి ఉన్నతాధికారులు వెళ్లిపోతుంటారు. అందుకు భిన్నంగా కలెక్టర్ వ్యవహరించారు. స్థానిక అధికారులకు ఏవైనా ఒత్తిళ్లు ఎదురవుతాయేమోనని భావించి వాటిని పూర్తిగా తొలగించే వరకు తానే స్వయంగా పర్యవేక్షించారు. ఆక్రమణల తొలగింపులో కేవలం నిబంధనలు పాటించకుండా మానవతా దృక్పథంతో వ్యవహరించారు. తిరుపతి మార్గంలోని ఓ అక్రమ భవనంలో హోటల్ నడుపుకుంటున్న వారు సామాన్లు చేరవేసుకునేందుకు రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వ భూమి అని తెలియక ఇతరుల వద్ద కొనుగోలు చేసిన వారికి సాయం చేస్తానని ప్రకటించారు. ఉద్దేశ్యపూర్వకంగా ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న వారిపై ఉక్కుపాదం మోపారు.


పీలేరు నాగిరెడ్డి కాలనీలో నిర్మాణదారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

మండల సర్వేయర్‌పై ఆగ్రహం

పీలేరు పట్టణం నాగిరెడ్డి కాలనీలోని సర్వే నెం.72/2 వ్యవహారంలో అత్యుత్సాహం ప్రదర్శించారంటూ పీలేరు మండల సర్వేయర్ కిరణ్మయిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దారుకు సమాచారం లేకుండా, ఆయన అనుమతి తీసుకోకుండా అక్కడ నిర్మాణదారుల విజ్ఞప్తి మేరకు భూమిని సర్వే చేయడం, స్కెచ్ అందజేయడం తప్పని మందలించారు. భవిష్యత్తులో అటువంటివి జరగకుండా చూసుకోవాలని హెచ్చరించారు. ప్రభుత్వ భూముల్లోని ఆక్రమణల తొలగింపు పూర్తయిన తరువాత పట్టణంలోని రోడ్లపై ఉన్న ఆక్రమణలను తొలగించాలని పీలేరు ఈవో గురుమోహన్‌ను ఆదేశించారు. ఆక్రమణల కారణంగా పట్టణంలోని రోడ్లన్నీ ఇరుకుగా మారి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని, స్థానికులకు అవగాహన కల్పించి ఆక్రమణలను తొలగించాలన్నారు. దీంతో ఈవో గురువారం సాయంత్రం పట్టణంలోని దుకాణదారులను ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. కొన్ని ఆక్రమణలను అప్పటికప్పుడు తొలగించగా మరికొన్నింటిని రెండు, మూడు రోజుల్లో తొలగించాలని తెలియజేశారు. ఆక్రమణల తొలగింపులో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దారు భీమేశ్వరరావు, మండల సర్వేయర్ కిరణ్మయి, ఎస్ఐ లోకేశ్, వీఆర్వోలు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల అభియోగాలపై కలెక్టర్ సీరియస్

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): భూముల మ్యుటేషన్లు చేస్తామంటూ డబ్బుల వసూళ్లకు దిగిన రెవెన్యూలో 20 మంది ఉద్యోగుల అభియోగాలపై కలెక్టర్ కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ సీరియస్ అయ్యారు. ఇంట రాక్టివ్ రెస్పాన్స్ సర్వీసెస్ (ఐవీఆర్ఎస్)ద్వారా భూముల మ్యుటేషన్లకు సిఫారసు చేసే విషయంలో జిల్లాలో పని చేస్తున్న 15మంది వీఆర్వోలు, ఇద్దరు రెవెన్యూ ఇన్ స్పెక్టర్లు, ముగ్గురు సర్వేయర్లు రైతుల నుంచి డబ్బుల వసూళ్లకు దిగారంటూ కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో హెచ్చరిస్తూ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రెవెన్యూలో ఉద్యోగులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తి ంచాలన్నారు. ఇలాంటి అభియోగాలు మళ్లీ వస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించినట్లు జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.


దళారులను నమ్మి మోసపోవద్దు

● డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో ఉద్యోగాలిప్పిస్తామంటూ దళారులు చెప్పే మాయ మాటలను నమ్మి మోసపోవద్దని డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు.

గత ఏడాది వైద్యశాఖలో నోటి ఫికేషన్ నెంబరు 2023/జూన్‌లో ఒప్పందం ప్రకారం స్టాఫ్ నర్సుల ఉద్యోగాలను భర్తీ చేసేందుకు దరఖాస్తులు స్వీకరించామన్నారు. మెరిట్ లిస్టను కడప.ఏపీ. జీవో వి.ఇన్‌లో అప్లోడ్ చేశామన్నారు. మెరిట్ లిస్టు ఆధారంగా అశోక్‌కుమార్ అనే వ్యక్తి 9038108948, 9951465818 ఫోన్ నెంబర్ల ద్వారా ఉద్యోగాలిప్పిస్తానంటూ ఫోన్ పే ద్వారా డబ్బులు వసూలు చేస్తున్నట్లు అభ్యర్థులు ఫిర్యా దులు చేశారన్నారు. ఇలా ఉద్యోగలిప్పిస్తామని మోసా లకు పాల్పడే వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని, నోటిఫికేషన్ గడువు కూడా ముగిసిందని, ఎవ్వరి మాట లు నమ్మి మోసపోవద్దని డీఎంహెచ్‌ఓ పేర్కొన్నారు.

జొన్న సొప్ప దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

జమ్మలమడుగు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో గురువారం మధ్యాహ్నం ప్రధాన రోడ్డుపై ట్రాక్టర్‌లో తీసు కెళుతున్న జొన్న సొప్ప దగ్ధమైంది. ముద్దనూరు మండలం గంగాదేవిపల్లెకు చెందిన ఇద్దరు రైతులు జమ్మలమడుగు మండలం ఎస్.ఉప్పలపాడు గ్రామ పొలాల్లో జొన్నగడ్డి కొనుగోలు చేసి తరలిస్తున్నారు. ఈ క్రమంలో జమ్మలమడుగు పాత బస్టాండు వద్ద స్థానికులు టపాసులు పేలుస్తుండగా జొన్న సొప్ప ట్రాక్టర్‌పై పడటంతో మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అయితే అప్పటికే సొప్ప అంతా కాలిపోయింది. దీంతో బాధిత రైతులు తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ... ఇద్దరికి తీవ్ర గాయాలు

నందలూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కడప - చెన్నై జాతీయ రహదారిలో మూసివేసిన ఆల్విన్ కర్మాగారం వద్ద గురువారం తెల్లవారుజామున బైకుపై వెళుతున్న ఇద్దరు యువకులను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. రాజంపట పట్టణంలో వివాహ కార్యక్రమానికి నందిమండలం సునీల్, నందిమండలం రమేష్ హాజరై తిరిగి వెళుతున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. గాయపడినవారిని వెంటనే 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హత్యాయత్నం కేసులో భార్యాభర్తలకు జైలు శిక్ష



శిక్షపడ్డ అయ్యవారయ్య, వీరమ్మ దంపతులు

సిద్దవటం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం పోలీసు స్టేషన్ పరిధిలో 2015లో జరిగిన హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితులకు ఐదేళ్ల జైలుశిక్ష, జరిమానా విధిస్తూ బద్వేల్ అడిషనల్ అసిస్టెంట్ సెషన్ జడ్జి పద్మశ్రీ తీర్పు వెలువరించారు. వివరాలిలా.. వంతాటిపల్లె గ్రామానికి చెందిన అయ్యవారయ్య(40), వీరమ్మ దంపతులు సిద్దవటంలో నివాసం ఉంటున్నారు. వీరు ఇంటి దగ్గర చెత్త, మురికినీరు విషయమై చీదెళ్ల సుజాత అనే మహిళతో గొడవపడి... ఆమెపై కత్తితో దాడిచేసి పొడిచారు. ఈ కేసుకు సంబంధించి గురువారం బద్వేలు అడిషనల్ అసిస్టెంట్ సెషన్ కోర్టులో విచారణకు రాగా నేరం రుజువు కావడంతో నిందితులకు ఐదేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చినట్లు ఇన్‌చార్జి ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు.

స్కూటర్ ఢీ.. ఒకరి మృతి

ఖాజీపేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కడప-కర్నూలు జాతీయ రహదారిలోని భూమాయపల్లె వద్ద స్కూటర్ ఢీకొన్న సంఘటనలో గూడతిరెడ్డి అరుణ (51) మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు... మండల పరిధిలోని భూమాయపల్లెలో జరిగే వివాహం కోసం హైదరాబాదు నుంచి వచ్చి భూమాయపల్లె వద్ద దిగి రోడ్డు క్రాస్ అవుతుండగా స్కూటర్ ఢీకొనడంతో తలకు తీవ్రగాయలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మోహన్ తెలిపారు.

పరిహార పంపిణీ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలి

● కలెక్టరు చెరుకూరి శ్రీధర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్

బద్వేలు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): బద్వేలు డివిజన్ పరిధిలో బెంగళూరు-విజయవాడ జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయే బాధితులకు త్వరగా పరిహారం పంపిణీ ప్రక్రియ పూర్త య్యేలా చూడాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదేశించారు. గురువారం ఆర్డీఓ కార్యాలయంలో డివిజనల్ స్థాయిలో మండల తహసీల్దార్లు, నేషనల్ హైవే అధికారులతో సమీక్షించిన ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా వివిధ ప్యాకేజీల్లో ఆయా మండలాల్లో పెండింగులో ఉన్న భూసేకరణ, అవార్డు పంపిణీ, కోర్టు పెండింగు పనులు, భూములు కోల్పోయిన బాధితులకు త్వరగా పరిహార పంపిణీ ప్రక్రియ పూర్తికావాలన్నారు. బద్వేలు రెవెన్యూ డివిజను పరిధిలో ఉన్న 9 మండలాల్లో ఇప్పటి వరకు నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 3778 ఫిర్యాదులు అందాయని, 1131 ఫిర్యాదులకు పరిష్కారం చూపామన్నారు. రీసర్వే గ్రామసభల్లో కూడా ఇప్పటికీ చాలా ఫిర్యాదులకు ఎందుకు పరిష్కారాలు చూపలేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం 8గంటలకు ఫీల్డ్ విజిట్ వెళ్లాలని, సంబంధిత అధికారులు రికార్డులు తమ వెంట తీసుకెళ్లి టార్గెట్ నిర్దేశించుకుని వచ్చిన ఫిర్యాదులకు పరిష్కారం చూపాలని తహసీల్దార్లను ఆదేశించారు. అనంతరం రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో రెవెన్యూ సిబ్బంది వివరాలు క్షేత్రస్థాయిలో సమస్యలను అధికారుల ద్వారా పూర్తిగా తెలుసుకున్నారు. కార్యక్రమంలో బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్, డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, నేషనల్ హైవే అధికారులు రెవెన్యూశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయ విద్యాలయాలను పటిష్టంగా నిర్వహించాలి

● డీఆర్‌వో మధుసూదన్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌వో మధుసూదన్‌రావు

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేస్తూ జవహర్ నవోదయ విద్యాలయాలను పటిష్టంగా నిర్వహించాలని డీఆర్‌వో మధుసూదన్‌రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రాయచోటి కలెక్టరేట్‌లో మినీ వీసీ హాలులో కలెక్టర్ చామకూరి శ్రీధర్, డీఆర్‌వో అధ్యక్షతన జవహర్ నవోదయ విద్యాలయాలకు సంబంధించి మేనేజ్మెంట్, అడ్వైజరీ కమిటీ, జిల్లా స్థాయి ఆహార కమిటీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జవర్‌హర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటు, పనితీరు, నిర్వహిస్తున్న తరగతులు, ఎంపిక విధానం, విద్యార్థుల సంఖ్య, అకడమిక్ కార్యక్రమాలు, లైబ్రరీ, ల్యాబులు, విజ్ఞాన్ జ్యోతి తదితరాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ గీత వివరించారు. అనంతరం డీఆర్‌వో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి ఎంపికైన ప్రతిభావంతులైన పిల్లలకు వారి కుటుంబ సామాజిక, ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా ప్రధానంగా సంస్కృతి, విలువల పెంపుదల, పర్యావరణంపై అవగాహన, సాహస కార్యకలాపాలు, నాణ్యమైన ఆధునిక విద్యను అందించాలని నవోదయ విద్యాలయ ఉపాధ్యాయు లు, టీచర్లకు సూచించారు. సమావేశంలో నారమరాజుపల్లి వైస్ ప్రిన్సిపల్ గంగాధరన్, ఆర్అండ్‌బీ ఈఈ సహదేవరెడ్డి, అడిషనల్ డీయంహెచ్‌వో ప్రశాంతి, డీపీఆర్‌వో పురుషోత్తం, డీఎస్‌వో రఘురాం, డిప్యూటీ డీఈవో శివప్రకాశ్‌రెడ్డి, విద్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌లో దొంగతనం

● గుట్టుచప్పుడు కాకుండా రికవరీ ● ఆలస్యంగా వెలుగుచూసిన వైనం

ఖాజీపేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఖాజీపేట పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్‌కు దొంగలవద్ద నుంచి రికవరీ చేసిన 14 కేజీల రాగివైరుపై కన్నుపడింది. ఎవరు కనుక్కోలేరని మోసపోయాడు. అయితే స్టేషన్‌లో సీసీ కెమెరాలు పరిశీలించడంతో ఆ కానిస్టేబుల్ బండారం బయటపడింది. పోలీసుస్టేషన్‌లో దొంగతనం జరిగిందంటే ప్రజలకు చెడు సంకేతాలు పోతాయని గుట్టుచప్పుడు కాకుండా రాగివైరును రికవరీ చేసి స్టేషన్‌లో ఉంచారు. ఈ సంఘటన వారం రోజుల తర్వాత వెలుగులోకి రావడంతో ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ఈ విషయంపై సీఐని వివరణ కోరగా కానిస్టేబుల్ రాగివైరు చోరీ చేశారని, డీఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆదేశాల మేరకు ఇడమడక చెక్‌పోస్టుకు పంపడం జరిగిందన్నారు. జిల్లా ఎస్పీకి నివేదిక ఇచ్చామని, వారి ఆదేశాలమేరకు చర్యలు తీసుకుంటామని సీఐ మోహన్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై వెళుతూ ఎదురుగా సైకిల్ మీద వచ్చే ఇద్దరు బాలురను తప్పించబోయి రోడ్డు మధ్యలో వున్న డివైడర్‌ను ఢీకొనడంతో కింద పడగా మరోబైక్ తొక్కించుకుంటూ పోవడంతో తన్వీర్ (15) అనే బాలుడు మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. అమృతనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ షేక్ ఖాదర్‌బాషా కుమారుడు తన్వీర్ చదువు మానేసి ప్రొద్దుటూరు శివాలయం సర్కిల్‌లోని పండ్ల దుకాణంలో పనిచేసేవాడు. బుధవారం మధ్యాహ్నం యజమాని భగత్ సింగ్‌కాలనీలోని తన ఇంటి వద్ద నుంచి భోజనం తీసుకురమ్మని చెప్పాడు. బైక్‌లో వెళుతుండగా పాలిటెక్నిక్ కాలేజీ దగ్గరకు వచ్చేసరికి ఎదరుగా సైకిల్ మీద వస్తున్న ఇద్దరు బాలురను తప్పించబోయి డివైడర్‌ను ఢీకొనడంతో కింద పడ్డాడు. అదే సమయంలో వేగంగా వస్తున్న మరో బైక్ తన్వీర్‌ను తొక్కించు వెళ్లడంతో తీవ్రగాయాలయ్యాయి. ఆసుపత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ట్రాఫిక్ సీఐ దేవకిరణ్ కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. తన్వీర్ మృతదేహాన్ని గురువారం పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు.

లారీ ఢీకొనడంతో వ్యక్తి..



నాగేంద్ర (ఫైల్)

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సింహాద్రిపురం మండలం బలపనూరు గ్రామానికి చెందిన ఎల్లమ్మగారి నాగేంద్ర (45) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వివరాలిలా.. పులివెందుల నుంచి బలపనూరు వెళుతున్న నాగేంద్రను ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నాగేంద్ర జేసీబీతో పనులు చేయించేవాడు. రోజువారి నిమిత్తం జేసీబీ పనిముట్ల కోసం పులివెందులకు వచ్చి తిరిగి బలపనూరు వెళుతుండగా స్థానిక ఆర్డీవో కార్యాలయం సమీపంలో గురువారం రాత్రి 8గంటల సమయంలో రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానిక ప్రజలు 108కు సమాచారం అందించగా వారు వచ్చినా అంతలోపే నాగేంద్ర మృతి చెందడం జరిగింది. మృతునికి భార్య, కుమార్తె, కొడుకు ఉన్నట్లు ఆ గ్రామ ప్రజలు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న పులివెందుల ట్రాఫిక్ సీఐ హాజీవల్లి తన సిబ్బందితో సంఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతుని వివరాలు తెలుసుకుని వారి బంధువులకు సమాచారం అందించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు.

అబార్షన్‌లు చేస్తే చర్యలు



అబార్షన్‌లపై ఆడిట్ నిర్వహిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శివప్రసాద్

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్ల పుడుతుందని అవసరం లేకున్నా అబార్షన్ చేస్తే చర్యలు తప్పవని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శివప్రసాద్ హెచ్చరించారు. గురువారం స్థానిక పీపీ యూనిట్ జిల్లా ఆస్పత్రిలో జమ్మలమడుగు డివిజన్ పరిధిలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రైవేటు ఆస్పత్రుల్లో జరిగే అబార్షన్‌లపై ఆడిట్ నిర్వహించారు. ఆడపిల్ల పుడుతుందని మొదటి , రెండో కాన్పుల్లో ఆడపిల్లలు పుట్టిన వారు ఈ అబార్షన్‌లు చేయించుకుంటున్నారన్నారు, ఆడిట్ చేసి ఎక్కడ అబార్షన్‌లు చేయించుకుంటున్నారో విచారించి సంబంధింత ప్రైవేటు ఆస్పత్రులపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో గైనకాలజిస్టు డాక్టర్ కావ్య, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్స్ ఎక్సైజ్ సీఐ కార్యాలయం తనిఖీ

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల ఎక్సైజ్ సీఐ కార్యాలయాన్ని రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం తనిఖీలు చేసి రికార్డులను పరిశీలించారు. ఎర్రగుంట్లలో మద్యం అధిక రేట్లు, సమయపాలనపై వారు ఆరా తీశారు. వీటిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించినట్లు సమాచారం. ఎక్సైజ్ ఈఎస్ మధుబాబు, ఇద్దరు సీఐలు పాల్గొన్నట్లు తెలుస్తోంది. ఈవిషయంపై స్థానిక ఎక్సైజ్ సీఐ గోపీక్రిష్ణను వివరణ కోరేందుకు ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు.

జూదరుల అరెస్టు

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని వెంకటాపురం గ్రామ పొలాల్లో జూద స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. గురువారం మధ్యాహ్నం అందిన సమాచారం మేరకు పట్టణ సీఐ నరసింహులు ఆధ్వర్యంలో పోలీసులు అరటి తోటలో జూద మాడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని 9 వాహానాలను, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నరసింహులు తెలిపారు. అరెస్టు అయిన వారి నుంచి రూ.35వేలు నగదు స్వాధీనం చేసుకున్నామని సీఐ వెల్లడించారు. మధ్యాహ్నం సంఘటన జరిగితే సాయంత్రం వరకు అధికార పార్టీ నాయకుల వత్తిడితో మీడియాకు వెల్లడించకుండా దాచడంపై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

● రికవరీ రూ.2,75,504... జరిమానా రూ.53,000



సామాజిక తనిఖీ బహిరంగ వేదికపై నివేదికలు పరిశీలిస్తున్న అడిషనల్ పీడీ నాగరత్నమ్మ

కాశినాయన ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకంలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డ్వామా అడిషనల్ పీడీ నాగరత్నమ్మ హెచ్చరించారు. గురువారం నర్సాపురం ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో ఎంపీడీఓ మైథిలీరెడ్డి అధ్యక్షతన ఉపాధి పథకంపై 19వ సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం నిర్వహించారు. వారం రోజులుగా ఎస్ఆర్‌పీ భాస్కర్ అధ్వర్యంలో గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందాలు చేపట్టిన విచారణలో వెలుగు చూసిన పలు అంశాలపై నివేదికలు అధికారుల ముందు సభలో చదివి వినిపించారు. అనంతరం ఎంపీడీఓ మీడియాతో మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరంలో 1005 పనులకు ఉపాధి పథకంలో రూ.9,96,30,430 ఖర్చు చేశామన్నారు. వీటిపై సామాజిక తనిఖీ బృందం చేపట్టిన విచారణలో తేలిన అంశాలపై అధికారులు పరిశీలించి రూ.2,75,504 రికవరీ చేశారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన ఇటుకులపాడు, వరికుంట్ల, ఆకుల నారాయణపల్లె, నర్సాపురం ఫీల్డ్ అసిస్టెంట్‌లను విధుల నుంచి తొలగించారన్నారు. మరి కొంతమంది సిబ్బందిపై రూ.53000 వరకు జరిమానా విధించారని తెలిపారు. గొంటువారిపల్లె, కత్తెరగండ్ల, రెడ్డికొట్టాల ఫీల్డ్‌అసిస్టెంట్‌లు రాజీనామా చేశారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి రామలింగేశ్వర్‌రెడ్డి, క్వాలిటీ కంట్రోల్ ఈఈ విజయభాస్కర్, ఏపీడీ ఆనంద్, స్థానిక సర్పంచ్ ఖాజావలి, ఇన్‌చార్జి ఏపీఓ నాగేంద్రప్రతాప్, మండల టీడీపీ నేతలు బసిరెడ్డి రవీంద్రారెడ్డి, పోలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డీటీసీ కె.ప్రసాద్

సికెదిన్నె, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై వాహనం నడిపేటప్పుడు డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి డీటీసీ కె.ప్రసాద్ తెలిపారు. స్థానిక ఉపరవాణా శాఖ కార్యాలయంలో గురువారం ఆటో డ్రైవర్లకు 36వ జాతీయ రహదారి భద్రత సందర్భంగా అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని, వాహనాలను ఎక్కడపడితే అక్కడ నిలిపి ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా చూడాలన్నారు. డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ కలిగి ఉండాలన్నారు. ప్రయాణికులను సామర్థ్యం మేరకే వాహనంలో ఎక్కించుకోవాలన్నారు. ట్రాఫిక్ సీఐ జావీద్ మాట్లాడుతూ చిన్నపిల్లలు, ఇతరులకు ఆటోలను బాడుగకు ఇచ్చి ప్రమాదాలను కొని తెచ్చుకోవద్దన్నారు. ఆటోలపై భారీ లగేజీలు వేసి ఇతరులకు ఇబ్బంది కలిగించవద్దన్నారు. ట్రాఫిక్ నియమాలను పాటించి ప్రమాదాలను నివారించాలన్నారు. కార్యక్రమంలో రవాణాశాఖ ఇన్‌స్పెక్టర్ విజయభాస్కర్, ప్రసాద్, శ్వేత, లక్ష్మీప్రసన్న ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ అరుణ్‌రెడ్డి, ఏపీఎస్ఆర్టీసీ డీఎం డిల్లీరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌పై ఆరోపణలు.. పూర్తి స్థాయి విచారణ

● జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి సురేశ్‌కుమార్



పట్టుబడిన రేషన్ బియ్యాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్, జిల్లా బీసీ సాంఘిక సంక్షేమ అధికారి

గాలివీడు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్థానిక బీసీ బాలుర వసతి గృహంలో బియ్యం దారి మళ్లిస్తున్నారంటూ విద్యార్థి సంఘం నాయకులు చేసిన ఆరోపణలపై పూర్తిస్థాయి విచారణ జరిపి నివేదికలు కలెక్టర్‌కు పంపనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి సురేశ్‌కుమార్ తెలిపారు. గురువారం తహసీల్దార్ భాగ్యలతతో కలిసి ఆయన బీసీ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాస్టల్ సిబ్బంది రెండు బస్తాల బియ్యం విక్రయిస్తున్నారంటూ ఆరోపిస్తూ ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోషియేషన్ జిల్లా కార్యదర్శి లవకుమార్ తమకు చరవాణిలో ఫిర్యాదు చేశారన్నారు. దీంతో బీసీ హాస్టల్‌ను సందర్శించగా రెండు బస్తాలు రేషన్ బియ్యం అదనంగా ఉండటం గుర్తించామన్నారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపిన అనంతరం కలెక్టర్ ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, సతీశ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

అగ్నికి ఆహుతైన మామిడిచెట్లు, డ్రిప్ పైపులు



అగ్నికి ఆహుతి అవుతున్న మామిడి చెట్లు

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిన్నెపాడు పంచాయతీలో బెస్తపల్లెకు చెందిన మద్దిరేవుల వెంకటరమణ అనే రైతు 20 మామిడిచెట్లు, 5 ఎకరాల డ్రిపు వైర్లు బుధవారం అగ్నికి ఆహుతైనట్లు రైతు తెలిపారు. ఈ సందర్భంగా వెంకటరమణ 5 ఎకరాల్లో మామిడి, వేరుశనగ పంటలు సాగుచేశారు. సోమవారం పశువుల కాపరులు అడివిలో చెత్తకు నిప్పు పెట్టడంతో కాలుకుంటూ మామిడి తోటలోని రూ.1 లక్ష విలువచేసే డ్రిప్ పరికరాలతో పాటు పైపులు, 10 ఏళ్ల వయస్సు గల మామిడి చెట్లు అగ్నికి ఆహుతయ్యాయని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన భూమిలో అష్టకష్టాలు పడి మామిడిచెట్లు, డ్రిపు పరికరాలతో పంటలు సాగు చేసుకుంటున్నానని, పశువుల కాపరులు చేసిన పనులకు దాదాపు రూ.2లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయారు.

వీరభద్రుడి సన్నిధిలో ఏఐఆర్ఎస్ డైరెక్టర్ మహేశ్



వీరభద్రుడి సన్నిధిలో డైరెక్టర్ మహేశ్

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామిని గురువారం కడప ఆల్ ఇండియా రేడియో స్టేషన్ (ఏఐఆర్ఎస్) డైరెక్టర్ చుండూరు మహేశ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు ఆలయ సాంప్రదాయపరంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన భద్రకాళీ అమ్మవారిని, వీరభద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు మహేశ్‌ను పూలమాల, శాలువాతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో వెంకట్రమణారెడ్డి, అర్చకులు కృష్ణయ్యస్వామి, యోగిస్వామి, వీరభద్రస్వామి ఆలయ విశిష్టత గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రేడియో అనౌన్సర్ రవికుమార్‌రెడ్డి, సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా సహసంస్కృతి ప్రముఖ్, రేడియో రంగస్థల కళాకారుడు తుమ్మల హరినాధ్‌లు పాల్గొన్నారు.

వ్యవసాయశాఖ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ



కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్

చిన్నమండెం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వ్యవసాయశాఖ కార్యాలయాన్ని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వ్యవసాయశాఖలో రైతులకు 11 అంకెలతో కూడిన ప్రత్యేక కార్డును జారీ చేస్తున్నామన్నారు. ఇది రైతుకు గుర్తింపు కార్డుగా ఉపయోగపడుతుందని తెలియజేశారు. రైతుల వివరాలు, ఆన్‌లైన్ నమోదు గురించి ఆరాతీశారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వారికి మరింత చేరువ చేయడానికి ఆధార్ తరహా ప్రత్యేక కార్డులు జారీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి రమేశ్, మండల వ్యవసాయ అధికారి గీత, సిబ్బంది పాల్గొన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- ఉప విద్యాశాఖాధికారి శివప్రకాశ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఉప విద్యాశాఖాధికారి శివప్రకాశ్‌రెడ్డి

సంబేపల్లె, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని రాయచోటి ఉప విద్యాశాఖ అధికారి శివప్రకాశ్‌రెడ్డి సూచించారు. గురువారం సంబేపల్లె మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. పదవ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. సిలబస్ పూర్తయ్యిందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పదవ తరగతి పునాది లాంటిదన్నారు. లక్షసాధన కోసం పట్టుదల, అంకితభావంతో కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి

నందలూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సోమశిల వెనుకజలాల మునక ప్రాంతమైన ఎగువరాజుపల్లె మాజీ సర్పంచ్ బాలరాజు కృష్ణవేణమ్మ(74) గురువారం మృతి చెందారు. ఈమె ఏకగ్రీవ సర్పంచ్‌గా ఎన్నికై ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ముందుండేవారు. ఈమె మృతి విషయం తెలుసుకున్న జనసేన నాయకులు యల్లటూరు శివరామరాజు, నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్‌తో పాటు పలువురు తమ ప్రగాఢ సంతాపాన్ని వారి కుటుంబానికి తెలియజేశారు.

కొన్నభూమి కొంత.. ఆక్రమించింది మరికొంత...?



ఆక్రమణకు గురైన మామిడి తోట

- మామిడి తోట సైతం ఆక్రమణ
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- ఆవేదనలో బాధిత రైతు

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): విక్రయించింది కొంత భూమి అయితే మరికొంత భూమిని ఆక్రమించారని, మామిడితోటను సైతం లెక్కచేయకుండా దౌర్జన్యంగా ఆక్రమించి చుట్టూ కంచె వేశారంటూ ఓ రైతు ఆవేదన చెందాడు. పొలం దగ్గరకు రానివ్వకుండా చంపుతామంటూ బెదిరిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని బాధిత రైతు లబోదిబోమంటున్నాడు. ఇప్పటి వరకు స్థానిక మండల రెవెన్యూ అధికారులకు, ఉన్నతస్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ న్యాయం జరగలేదని చెబుతున్నాడు. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే..

ఓబులవారిపల్లె మండల పరిధిలోని చెన్నరాజుపోడు గ్రామ పొలంలో సర్వేనంబరు 1613, 1614, 1616 సంబంధించిన ఒక ఎకరా 75 సెంట్ల భూమి ఆక్రమణకు గురైందని, తన భూమి తనకు ఇప్పించండి మహాప్రభో అంటూ అదే గ్రామానికి చెందిన పత్తి సుబ్బరాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక పరిస్థితి బాగాలేక తనకు ఉన్న భూమిలో 10.80 ఎకరాలను పెద్ద మనుషుల సమక్షంలో ఓ వ్యక్తికి విక్రయించానన్నాడు. కానీ తాను బతుకుదెరువు కోసం గల్ఫ్‌కు వెళ్లిన సమయంలో సదరు భూమి కొనుగోలు చేసిన వ్యక్తి అదనంగా 1.75 ఎకరాల భూమిని అక్రమంగా దౌర్జన్యంగా ఆక్రమించారని కన్నీటి పర్యంతమయ్యాడు. అప్పటి నుంచి అనేకసార్లు తహసీల్దారు కార్యాలయానికి తిరిగినా, భూమి కొలతలకు చలానాలు కట్టినా ఎవరూ పట్టించుకోలేదని ఆరోపించాడు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రెవెన్యూ సదస్సులో కూడా ఫిర్యాదు చేసినప్పటికీ స్థానిక అధికారులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఫిర్యాదు చేసిన ప్రతి రైతు పొలం దగ్గరకు వెళ్లి సర్వేలు చేశారే కానీ, తన పొలంవైపు కన్నెత్తి చూడలేదని ఆరోపిస్తున్నాడు. అంతేకాకుండా తాను పొలం దగ్గరకు వెళ్తే తనపై దౌర్జన్యం చేస్తున్నారని చెబుతున్నాడు. కాగా గతంలో స్థానిక ఎస్ఐ, పోలీసులు, 20 మంది పెద్ద మనుషుల సమక్షంలో భూమి కొలతలు వేశారు. ఒక ఎకరా 75 సెంట్లు భూమి ఎక్కువగా ఉందని తేల్చారు. కానీ ఆక్రమణకు గురైన భూమి ఇంతవరకు తనకు స్వాధీనపరచలేదని బోరున విలపించాడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విచారణ జరిపి మండల రెవెన్యూ సర్వేయర్‌తో కొలతలు వేయించి తన భూమిని తనకు ఇప్పించాలని వేడుకుంటున్నాడు.

ఆక్రమించిన భూమిని నాకు ఇప్పించండి

- పత్తి సుబ్బరాయుడు, రైతు, చెన్నరాజు పోడు



నేను అమ్మింది కొంత భూమి అయితే.. అదనంగా మరికొంత భూమిని ఆక్రమించారు. ఇందుకు స్థానిక రెవెన్యూ అధికారులు వారికి కొమ్ముకాస్తున్నారు. ఇప్పటికైనా భూమి కొలతలు వేసి నా భూమి నాకు ఇప్పించండి. మీకు రెండు చేతులు జోడించి దండం పెడతాను. నేను దిక్కులేని పేదవాడిని, చట్టపరంగా న్యాయం చేయండి.

నా దృష్టికి వస్తే సమస్య పరిష్కరిస్తా

- శ్రీధర్‌రావు, తహసీల్దారు

రైతు పత్తి సుబ్బరాయుడు భూమి ఆక్రమణ విషయం నా దృష్టికి రాలేదు. ఈ సమస్య గురించి మా సిబ్బందితో ఆరాతీస్తాను. సర్వేయర్‌ను పంపి కొలతలు వేసి బాధితుడికి న్యాయం చేస్తాము. ఆక్రమణకు పాల్పడినట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటాం.

అంగన్వాడీల మహాధర్నాను జయప్రదం చేయండి

- ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పిలుపు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాలో ఈ నెల 17వ తేదీన అంగన్వాడీల సమస్యల మీద మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎస్.శ్రీలక్ష్మి, ప్రధాన కార్యదర్శి రాజేశ్వరి, వర్కింగ్ ప్రెసిడెంట్ భాగ్యలక్ష్మి, కోశాధికారి బంగారుపాపలు పేర్కొన్నారు. గురువారం జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో పీడీ రమాదేవికి మహాధర్నాకు సంబంధించిన నోటీసును అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ అంగన్వాడీల 42 రోజుల చారిత్రాత్మక సమ్మె సందర్భంగా వైసీపీ ప్రభుత్వం యూనియన్ ప్రతినిధులతో చర్చలు జరిపి డిమాండ్స్‌ను అంగీకరించి గ్రూప్ ఆఫ్ మినిట్స్ కాపీలో పొందుపర్చినా అమలు చేయకుండా కూటమిప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. అలాగే వేతనాల పెంపుదల, గ్రాట్యుటీ అమలు, మెటర్నిటీ లీవులు, ప్రమోషన్లు, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చడం, సూపర్‌వైజర్ పోస్టుల భర్తీ చేయాలని, ప్రీ స్కూల్ బలోపేతం చేయాలని తదితర డిమాండ్ల సాధనకై జరుగుతున్న మహాధర్నాకు జిల్లాలోని అంగన్వాడీలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

సౌరవిద్యుత్ బైకు ప్రారంభం



బైకును ప్రారంభిస్తున్న చొప్పా గంగిరెడ్డి

రాజంపేటటౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో సౌర విద్యుత్ బైకును విశ్వవిద్యాలయ చాన్సలర్ చొప్పా గంగిరెడ్డి ప్రారంభించారు. విశ్వవిద్యాలయంలోని ట్రిపుల్‌ఈ విభాగానికి చెందిన సాయిసందీప్ పర్యవేక్షణలో విద్యార్థులు డి.నవీన్‌కుమార్‌రెడ్డి, ఆర్.మణిధనుష్‌వర్మ, శివమహేశ్వర్‌రెడ్డి, పి.నజీర్‌హుస్సేన్‌లు పర్యావరణ హితమైన సౌర విద్యుత్ బైకును రూపొందించారు. 45 కి.మీ. వేగంతో 30 కి.మీ. మైలేజీని అందిస్తుందన్నారు. దీన్ని రూపొందించిన విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ డి.సాయిబాబారెడ్డి, ప్రో చాన్సలర్ చొప్పా అభిషేక్‌రెడ్డి, వైస్‌చైర్మన్ చొప్పా యల్లారెడ్డి, రిజిస్ట్రార్ మల్లికార్జునరావు, ప్రిన్సిపల్ ఎస్ఎంవీ నారాయణ, ఈఈఈ విభాగాధిపతి పద్మలలిత పాల్గొన్నారు.

సబ్‌కలెక్టరేట్ ఎదుట సీపీఐ ధర్నా



రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

రాజంపేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఇంటి స్థలాలు, వ్యవసాయ భూములను ఇవ్వాలని కోరుతూ గురువారం రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఐ నాయకులు ధర్నా నిర్వహించారు. ప్రతి పేదవానికి 2 ఎకరాల భూమి, పట్టణాల్లో 2 సెంట్లు, పల్లెల్లో 3 సెంట్లు ఇంటి స్థలాలు ఇవ్వాలని నినాదాలు చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ పాలకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు అనుగుణంగా ఈ డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ నిదియాదేవికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మహేష్, శివరామకృష్ణదేవర, సికిందర్, గాలి చంద్ర, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'వల్లభనేని వంశీ అరెస్ట్ పట్ల హర్షం'

రాజంపేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు వల్లభనేని వంశీ అరెస్ట్‌తో రాష్ట్ర ప్రజలతో పాటు తాము హర్షిస్తున్నామని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వల్లభనేని వంశీ లాంటి అవినీతి, నీతిమాలిన రాజకీయ నాయకులను వేటాడే ఆట ఇప్పుడే మొదలైంన్నారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు పోలి శివకుమార్, తెలుగు యువత రాజంపేట పార్లమెంట్ అధికారి ప్రతినిధి పాండురాజు పాల్గొన్నారు.

'ఇంటి స్థలాలు మంజూరు చేయాలి'

చిట్వేలి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని రైల్వేకోడూరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, రైతు సంఘం నాయకులు తిప్పన ప్రసాద్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు చిట్వేలి తహసీల్దారు కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి కటారు శంకరయ్య, గ్రామ కార్యదర్శి శ్రీను, వికలాంగుల సంఘం అధ్యక్షుడు ఆంధ్రయ్య తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన సుగవాసి

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాలివీడు రోడ్డులో గల టీడీపీ కార్యాలయంలో గురువారం ఏపీ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ క్యాలెండర్లను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ పరశురాం ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల బృందం ప్రసాద్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్చం అందజేశారు. అనంతరం ఆయన ఏపీ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన సంవత్సరం 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నరసింహకుమార్



నరసింహకుమార్

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రాయచోటి ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నరసింహకుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో డిప్యూటీ తహసీల్దార్, ఇన్‌చార్జి తహసీల్దార్, పుల్లంపేట ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పనిచేసి ప్రస్తుతం కలెక్టరేట్‌లోని ఎన్నికల విభాగంలో అకౌంట్ సెక్షన్‌లో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో రాయచోటి తహసీల్దార్‌గా పనిచేస్తున్న పుల్లారెడ్డి నందలూరుకు బదిలీకావడంతో ఆయన స్థానంలో నరసింహకుమార్‌ను నియమించారు. ఈ మేరకు ఆయన రాయచోటి ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు.

అక్రమ మద్యం బాటిళ్లు ధ్వంసం



మద్యం బాటిళ్లను ధ్వంసం చేస్తున్న పోలీసులు

సంబేపల్లె, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సంబేపల్లె పోలీస్‌స్టేషన్ పరిధిలో 2024 జనవరి నుంచి డిసెంబరు వరకు అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన మద్యం బాటిళ్లను గురువారం ఎస్ఐ భక్తవత్సలం, ఏఈఎస్ జోగేంద్ర సమక్షంలో పోలీసులు ధ్వంసం చేశారు. మండల పరిధిలో వివిధ ప్రాంతాల నుంచి అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన 29 కేసులకు సంబంధించి 334 క్వార్టర్ బాటిళ్లు, నాలుగు ఫుల్‌బాటిళ్లు, 30 లీటర్ల నాటుసారా ధ్వంసం చేసినట్లు తెలిపారు. వీటికి గడువు ముగియంతో నాశనం చేసినట్లు తెలిపారు. అక్రమ మద్యం తరలిస్తూ ఎవరైనా పట్టుబడితే కేసు నమోదు చేసి చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ సుబ్బయ్య, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఖాతాల నిర్వహణ ముఖ్యం: ఏపీఎం

ఓబులవారిపల్లె,ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండల సమాఖ్య కార్యాలయంలో గ్రామ పంచాయతీల పరిధిలోని వీవోఏలకు యాప్ నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు ఏరియా కోఆర్డినేటర్, ఏపీఎం మల్లికార్జునరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గత మూడు రోజులుగా గ్రామ పంచాయతీలకు సంబంధించిన, వీవోలకు సంబంధించిన ఖాతాల నిర్వహణ, లావాదేవీలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్, ఏపీఎం మల్లికార్జునరాజు, సీసీలు దామోదర్, వెంకటసుబ్బమ్మ, గోవిందమ్మ, హరిబాబు, అకౌంటెంట్ శివయ్య, వీవోఏలు పాల్గొన్నారు.

లంకమల్ల అడవుల్లో అరుదైన చిత్రాల పరిశీలనకు అనుమతి

సిద్దవటం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): లంకమల్ల అడవుల్లో అరుదైన చిత్రాలను పరిశీలించేందుకు భారతీయ పురావస్తు శాఖ డైరెక్టర్ డాక్టర్ మునిరత్నంకు అనుమతి లభించిందని ఫారెస్ట్ రేంజి అధికారి కళావతి గురువారం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లంకమల్ల అడవుల్లో రేఖాచిత్రాలు పరిశీలించడానికి పీసీసీఎఫ్ ద్వారా అనుమతి లభించిందన్నారు. ఫిబ్రవరి 28, మార్చి 1, 2 తేదీల్లో సిద్దవటం, కొండూరు, మద్దూరు బీట్‌లలో రేఖా చిత్రాలను పరిశోధన చేస్తారని ఆమె తెలిపారు.

తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా

పుల్లంపేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నిరుపేద గిరిజనులకు ఇంటిపట్టాలు, బంజరు భూములు పంపిణీ చేయాలని గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట సీపీఐ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి, జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టప్ప, నియోజకవర్గ కార్యదర్శి జయరామయ్య ఆధ్వర్యంలో సుమారు 50 మంది ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సెల్వకుమార్, వెంకటరమణ, గోపాల్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుకెళ్లాలి

- ఘనంగా జాతీయ మహిళా దినోత్సవం

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో ముందుకెళ్లాలని రైల్వేకోడూరు మాజీ జడ్పీటీసీ సభ్యురాలు రాజేశ్వరి తెలిపారు. గురువారం పట్టణంలోని ఆమె స్వగృహంలో మహిళలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాపు నాయకులు నాగేంద్ర, రత్తయ్య, బీసీ నాయకుడు మహేష్, మైనార్టీ నాయకులు రౌఫ్, కరీముల్లా, రాజా, మహిళా నాయకురాలు అరుణ పాల్గొన్నారు.

పుల్లంపేట: మండల పరిధిలోని దళవాయిపల్లె ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు రమణ ఆధ్వర్యంలో జాతీయ మహిళా దినోత్సవం గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సరోజినినాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సీఐ యల్లమరాజు వీఆర్‌కు బదిలీ



సీఐ యల్లమరాజు

రాజంపేటటౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రాజంపేట పట్టణ సీఐ యల్లమరాజు రాయచోటి వీఆర్‌కు బదిలీ చేస్తున్నట్లు పోలీసు ఉన్నతశాఖ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. గత ఆరు నెలల క్రితం రాజంపేట పట్టణ సీఐగా బాధ్యతలు చేపట్టారు. కానీ అతితక్కువ సమయంలో యల్లమరాజును వీఆర్‌కు పోలీసుశాఖ బదిలీ చేసింది. నంద్యాల సీఐగా పనిచేస్తున్న రాజాను బదిలీపై నియమించినట్లు సమాచారం.

అటవీశాఖపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సిద్దవటం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని విద్యార్థులకు గురువారం లంకమల్ల అటవీ ప్రాంతం సిద్దవటం బీట్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జడ్పీ హైస్కూల్ విద్యార్థిని విద్యార్థులకు అటవీ సంపదపై వన్యప్రాణుల సంరక్షణ, కొండకు నిప్పు పెట్టడం వల్ల కలిగే పరిణామాలు, కొన్ని ఔషధ మొక్కలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజి అధికారి కళావతి మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు చదువుతో పాటు లంకమల్ల అటవీ ప్రాంతంపై అవగాహన ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ ఓబులేశు, స్థానిక ఉపాధ్యాయులు, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా కాశినాయన ఆరాధన ఉత్సవాలు

సిద్దవటం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివునిపల్లె గ్రామ సమీపాన వెలసిన సద్గురు కాశిరెడ్డినాయన తిరుణాల మహోత్సవం సందర్భంగా గురువారం టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు ఉత్సవాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. మధ్యాహ్నం 3 గంటలకు వృషభరాజుల బండలాగుడు పోటీలను పంచాయతీరాజ్ ఆర్గనైజర్ కమిటీ సెక్రటరి కుప్పాల వెంకటసుబ్బయ్య ప్రారంభించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఒంటిమిట్ట సీఐ బాబు ఆధ్వర్యంలో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సర్వే కష్టాలు

- సర్టిఫికెట్ కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- సర్వే సర్టిఫికెట్ లేనిదే రిజిస్ట్రేషన్ చేయనంటున్న సబ్ రిజిస్ట్రార్లు
- మండల సర్వేయర్ పరిధిలో పొందవచ్చని అంటున్న తహశీల్దార్లు
- గగ్గోలు పెడుతున్న ప్రజలు



రైల్వేకోడూరు తహశీల్దార్ కార్యాలయం

రైల్వేకోడూరు రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సర్వే సర్టిఫికెట్ల కోసం చాలామంది బాధితులు ఎవరు ఇస్తారో అర్థం కాక అటు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఇటు రెవెన్యూ కార్యాలయానికి ప్రదక్షిణలు చేస్తూ అష్టకష్టాలు పడుతున్నారు. ఏం చేయాలో దిక్కుతోచక గగ్గోలు పెడుతున్నారు. సర్వే సర్టిఫికెట్ మండల సర్వేయర్ పరిధిలో పొందవచ్చని తహసీల్దార్లు అంటున్నా... తహశీల్దార్లు సర్టిఫికెట్ ఇస్తేనే రిజిస్టర్ చేస్తామని పుల్లంపేట, చిట్వేల్ సబ్ రిజిస్ట్రార్లు చెబుతున్నారు. ముఖ్యంగా సర్వే సర్టిఫికెట్లు, అనుభవం సర్టిఫికెట్లు ఇచ్చేందుకు రెవెన్యూ అధికారులు ఏమాత్రం సుముఖంగా లేరు. గతంలో జరిగిన పొరపాట్లు వలన తహశీల్దార్లు ఇబ్బందులకు గురికావడంతో పై అధికారుల ఆదేశాల మేరకు సర్టిఫికెట్లు జారీ చేయలేమని చెబుతున్నారు.

గతంలో ఇంటి స్థలం డాక్యుమెంట్లు ఉంటే రిజిస్టర్ అవుతుండేవి. కానీ ఇప్పుడు డాక్యుమెంట్‌లో సర్వే నెంబర్ లేదని రెవెన్యూ అధికారుల వద్ద సర్టిఫికెట్ తెచ్చుకోవాలని సబ్ రిజిస్ట్రార్లు చెబుతున్నారు. మండల సర్వేయర్ సర్టిఫికెట్లు మంజూరు చేసినా రిజిస్టర్ ఎందుకు చేయడం లేదని బాధితులు సబ్ రిజిస్ట్రార్లను ప్రశ్నిస్తున్నారు. తహసీల్దార్ సర్టిఫికెట్ ఇస్తేనే రిజిస్టర్ చేస్తామని తెగేసి చెబుతున్నారు. డాక్యుమెంట్లు లేకుండా కేవలం సర్వే సర్టిఫికెట్‌పై రిజిస్టర్ చేస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. కేవలం సర్వే సర్టిఫికెట్లు లేకపోవడంతో పుల్లంపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వందల డాక్యుమెంట్లు నిలిచిపోయాయి. దీని వలన ప్రభుత్వానికి వచ్చే ఆదాయం భారీగా తగ్గడంతో పాటు బాధితులు ఇబ్బందులు పడుతున్నారు. సర్వే సర్టిఫికెట్ల కోసం బాధితులు రెవెన్యూ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తమ సమస్యకు పరిష్కారం ఏంటని బాధితులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. అధికారులు స్పందించకుంటే ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి గండి పడే అవకాశం ఉంది.


పుల్లంపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

సర్వే సర్టిఫికెట్ ఎందుకు ?

ఇంటి స్థలం డాక్యుమెంట్లు అన్నీ సక్రమంగా ఉన్నా సర్వే సర్టిఫికెట్ ఎందుకని పలువురు ప్రశ్నిస్తున్నారు. గతంలో రిజిస్టర్ అయిన డాక్యుమెంట్లకు సర్వే నెంబర్ లేనందున రెవెన్యూ కార్యాలయంలో సర్టిఫికెట్ తీసుకోవాలని సబ్ రిజిస్ట్రార్లు చెబుతున్నారు. ఇంటి స్థలం డాక్యుమెంట్‌పై సర్వే సర్టిఫికెట్ పొందాలంటే మండల సర్వేయర్‌కు వినతిపత్రం ఇవ్వాలి. గ్రామ సర్వేయర్ సహకారంతో మండల సర్వేయర్ సర్వే నిర్వహించి బాధితులకు సర్టిఫికెట్లు అందజేస్తారు. ఇందులో తహశీల్దార్ ప్రమేయం ఎంతవరకు ఉండదు. మండల సర్వేయర్ మంజూరు చేసిన సర్టిఫికెట్‌పై తహసీల్దార్ సంతకం లేనిదే రిజిస్టర్ చేయలేమని పుల్లంపేట, చిట్వేలి సబ్ రిజిస్ట్రార్లు బాధితులను కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారు. డాక్యుమెంట్ సక్రమంగా ఉన్నా కూడా అవి లేవని.. ఇవి లేవని పుల్లంపేట సబ్ రిజిస్ట్రార్ బాధితులను కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారని పలు ఆరోపణలు ఉన్నాయి.

మా ప్రమేయం ఉండదు

ఇంటి స్థలాల డాక్యుమెంట్ సర్వేపై మా ప్రమేమం ఉండదు. మండల సర్వేయర్ సర్వే నిర్వహించి సర్టిఫికెట్ మంజూరు చేస్తారు. కేవలం ప్రభుత్వ, వ్యవసాయ భూములకు మాత్రమే మేము సర్టిఫికెట్ మంజూరు చేస్తాము. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇంటి స్థలాల రిజిస్టర్ డాక్యుమెంట్లపై సర్వే సర్టిఫికెట్ ఇవ్వలేము. డాక్యుమెంట్లు పరిశీలించకుండా మేము ఇచ్చే సర్టిఫికెట్లపై ఎలా రిజిస్టర్ చేస్తారు. కార్యాలయానికి వచ్చే ప్రజలకు వారికి కావాల్సిన పత్రాలపై సరైన అవగాహన కల్పించాలి. తహసీల్దార్లపై విమర్శలు చేయడం తగదు.

- షేక్ మహబూబ్ చాంద్,
తహశీల్దార్, రైల్వేకోడూరు

సర్వే నెంబర్ లేనిదే రిజిస్ట్రేషన్ చేయలేము

గతంలో పట్టణంలో డోర్ నెంబర్, హద్దుల వివరాల మేరకు రిజిస్ట్రేషన్ చేసేవారం. కానీ ఇప్పుడు డాక్యుమెంట్లలో సర్వే నెంబర్ లేనిదే రిజిస్ట్రేషన్ చేయలేము. సర్వే నెంబర్ సర్టిఫికెట్‌పై స్థానిక తహశీల్దార్ సంతకం తప్పనిసరిగా ఉండాలి. మాపై జిల్లా అధికారుల ఆదేశాల ఉన్నాయి. అన్ని పత్రాలు సక్రమంగా ఉంటేనే రిజిస్ట్రేషన్ చేస్తాము.

- షేక్ మహమ్మద్ రఫీ,
సబ్‌రిజిస్ట్రార్, పుల్లంపేట

నాకు న్యాయం ఎలా జరుగుతుంది ?



నేను సంపాదించిన ఆస్తిని నా కుమారుడి పేరుతో రిజిస్టర్ చేయడానికి పుల్లంపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాను. అక్కడ నా డాక్యుమెంట్లు పరిశీలించి సర్వే నెంబర్ లేదని, తహశీల్దార్ వద్ద తీసుకుని రావాలని సబ్ రిజిస్ట్రార్ తెలిపారు. కానీ తహశీల్దార్ వద్దకు వెళితే మండల సర్వేయర్ వద్ద తీసుకోవాలని తెలిపారు. సర్వేయర్ ఇచ్చిన సర్టిఫికెట్‌పై తహశీల్దార్ సంతకం చేస్తేనే రిజిస్టర్ చేస్తామని సబ్ రిజిస్ట్రార్ తెలిపారు. గతంలోని డాక్యుమెంట్లు పరిశీలించిన తరువాతే రిజిస్ట్రేషన్ చేస్తామని చెబుతున్నారు. ఇప్పుడు నా సమస్యకు పరిష్కారం ఏమిటి.

- సయ్యద్ ఉస్మాన్, రైల్వేకోడూరు

రూ.5.7 కోట్లతో వాటర్‌షెడ్ పనులు

- డ్వామా పీడీ వెంకటరత్నం


వాటర్‌షెడ్ సభ్యులకు మెమెంటో, ప్రశంసాపత్రాలను అందిస్తున్న ఏపీడీ

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): బి.ఎర్రగుడి వాటర్ షెడ్ ప్రాజెక్టు కింద ఐదు మైక్రోవాటర్‌షెడ్ గ్రామాల్లో 4911 హెక్టార్లల్లో రూ.5.7 కోట్లతో వాటర్‌షెడ్ పనులు మంజూరయ్యాయని డ్వామా పీడీ వెంకటరత్నం పేర్కొన్నారు. బుధవారం కోసంపేట, జాండ్రపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో వాటర్‌షెడ్ యాత్రపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కోనంపేట పంచాయతీలోని రూ.3.82 లక్షలతో చెక్ డ్యామ్ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పీడీ మాట్లాడుతూ మండలంలో బి.ఎర్రగుడి వాటర్‌షెడ్ ప్రాజెక్టు దిన్నెపాడు, బి.ఎర్రగుడి, కోనంపేట, దప్పేపల్లె పాళెంగొల్లపల్లె గ్రామాల్లో సుమారు 4911 హెక్టార్లతో ఎన్ఆర్ఎం (సహజవనరుల అభివృద్ధి పథకం) కింద గ్రామాల్లో పనులు చేపడుతామని ఆయన అన్నారు. ఈ ఐదు గ్రామాల్లో నీరు నిల్వ నీటిగుంతలు, పారంపాండు పనులు, డకోట్ పనులు చేపట్టి సహజవనరులను కాపాడుకోవాలని ఆయన అన్నారు. ఈ 5 గ్రామాలను ఐదేళ్లలో పనులు పూర్తి చేస్తే రైతులు, గ్రామాలు సస్యశ్యామలంగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. టీడీపీ మండల ఇన్‌చార్జ్ యనమల మదన్‌మోహన్ మాట్లాడుతూ వాటర్‌షెడ్ పనులను దుర్వినియోగం చేయకుండా పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం హైస్కూల్ విద్యార్థులచే ర్యాలీ నిర్వహించి వాటర్‌షెడ్ మెంబర్లకు మెమెంటో, ప్రశంసాపత్రాలను అందజేసి పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉపాధి క్లస్టర్ ఏపీడీ నందకుమార్‌రెడ్డి, వాటర్‌షెడ్ ఏపీడీ లక్ష్మినరసయ్య, పీఓ వెంకటరామిరెడ్డి, కోనంపేట సర్పంచు లక్ష్మినారాయణ, వాటర్‌షెడ్ రమణ, ఉపాధి ఇన్‌చార్జ్ ఏపీవో వెంకటపతి, సభ్యులు కొనసాని రాజారెడ్డి, దిన్నెపాడు పెద్దచెరువు చైర్మన్ మోహన్‌రెడ్డి, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

మల్లయ్యకొండ అడవికి నిప్పు


అడవిలో చెలరేగుతున్న మంటలు

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్య కొండ అటవీ ప్రాంతాలు అగ్నికి ఆహుతవుతున్నాయి. గురువారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు కొండ కింద దక్షిణ అటవీ భాగంలో నిప్పుపెట్టడంతో అవి పెద్ద ఎత్తున చెలరేగి సాయంత్రానికి క్రమంగా మల్లయ్యకొండకు వ్యాపించాయి. దీంతో మల్లయ్యకొండ అటవీ ప్రాంతంలో ఉన్న బద్రోళ్లగుట్ట, చింతల పులకోన, జంగంమూల, మిరపచెట్లదిన్నె తదితర ప్రాంతాలు కలిపి సుమారు 500 హెక్టార్ల వరకూ అగ్నికి ఆహుతి అయినట్లుగా తెలుస్తోంది. వందల ఎకరాల్లో అడవి కాలిపోవడంతో పలు రకాల జాతులకు చెందిన వృక్షసంపద, వన్యప్రాణులు మంటలకు మాడి మసైపోయాయి. మల్లయ్య కొండ, ఇనుముకొండల్లో దొరికే ఉసిరి, బిక్కి, ఈత, నేరేడు, తదితర ఫలాలను పలువురు స్థానికులు, గిరిపుత్రులు విక్రయించుకొని జీవనోపాధి పొందుతున్నారు. అయితే, కొంత మంది ఆకతాయిలు అడవులకు నిప్పు పెట్టడం వలన ఏళ్ల నాటి విలువైన వృక్ష సంపద కాలిపోయి జీవనోపాధి కోల్పోతున్నారు. కాగా, మల్లయ్యకొండ అటవీ ప్రాంతంలో చెలరేగిన అగ్ని కీలలు క్రమంగా సమీప పొలాల్లో ఉన్న వేరుశనగ, మామిడి తోటలకు మంటలు వ్యాపించాయి. దీంతో స్థానిక రైతులు తీవ్రంగా కృషిచేసి పొలాల్లోకి వ్యాపించిన మంటలను ఆర్పివేశారు. మంటలను ఆర్పడానికి ప్రయత్నిస్తున్నట్లు ఫారెస్ట్ ఎఫ్‌బీవో రామరాజు తెలిపారు.

కూలీలకు 150 రోజులు పనులు కల్పించాలి

రామాపురం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలాన్ని కరువు మండలంగా ప్రభుత్వం ప్రకటించినందున జాతీయ ఉపాధి హామీ పథకంలో 150 రోజులు ఉపాధి పనులు కల్పించాలని జిల్లా ఉపాధి పీడీ వెంకటరత్నం పేర్కొన్నారు. మండలంలోని చిట్లూరు గ్రామంలోని పెద్దచెరువులో ఉపాధి పనులను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిట్లూరు గ్రామంలో 225 మంది కూలీలు పనిచేస్తున్నారని, మండల వ్యాప్తంగా 2200 పైగా కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారని, ఉపాధి పనులను నాణ్యతగా పనులు చేపట్టాలన్నారు. జిల్లాలో 58 వేల మంది కూలీలు పనిచేస్తున్నారని, జిల్లా వ్యాప్తంగా రైతులు 38 వేల ఎకరాల్లో పండ్ల తోటలను 2024-25 సంవత్సరంలో పెంపకం చేపట్టామన్నారు. రైతులు తమ పొలాల్లో ఫారంపాండు పనులు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో పెంచలయ్య, ఈసీ శివయ్య, టీఏలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురు తహశీల్దార్ల బదిలీ

మదనపల్లె, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో డిప్యుటేషన్‌పై ముగ్గురు తహశీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో గతంలో నిమ్మనపల్లె తహశీల్దార్‌గా పనిచేసిన కె.ధనంజయులు మదనపల్లెకు, నందలూరులో పనిచేస్తున్న తహశీల్దార్ కె.అమర్‌నాథ్‌ను నిమ్మనపల్లెకు బదిలీ చేశారు. అలాగే కలెక్టరేట్‌లోని ఎన్నికల విభాగంలో పనిచేస్తున్న పి.నరసింహకుమార్‌ను రాయచోటి ఇన్‌చార్జ్ తహశీల్దార్‌గా నియమించారు. రాయచోటిలో పనిచేస్తున్న పుల్లారెడ్డిని నందలూరుకు బదిలీ చేశారు. అలాగే గతంలో మదనపల్లెలో పనిచేస్తూ ప్రస్తుతం సెలవులో ఉంటున్న ఎస్.ఖాజాబీని సెలవు పూర్తయ్యాక పోస్టింగ్ కోసం కలెక్టరేట్‌లో రిపోర్ట్ చేసుకోవాలని కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈమెను మదనపల్లె నుంచి పది రోజుల క్రితం కలెక్టర్ నిమ్మనపల్లెకు బదిలీ చేయగా విధుల్లో చేరకుండా సెలవులో వెళ్లారు.

ఎంపీ మిథున్‌రెడ్డి రాజీనామా చేయాలి

- రాజంపేట పార్లమెంటు బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేశ్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్

రాజంపేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): భూకబ్జాదారులు, అటవీభూముల ఆక్రమణదారులు, అవినీతిపరులైన ఎంపీ మిథున్‌రెడ్డి కుటుంబం వెంటనే తమ పదవులకు రాజీనామా చేసి రాజకీయాల నుంచి వైదొలగాలని రాజంపేట పార్లమెంటు బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేశ్ డిమాండ్ చేశారు. గురువారం రాజంపేట బీజేపీ పార్లమెంట్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఎంపీ మిథున్‌రెడ్డి పదేళ్ల ఎంపీగా, గత జగన్ ప్రభుత్వంలో అధికార పార్టీ నేతగా వారి తండ్రి మంత్రిగా, చిన్నాన్న ఎమ్మెల్యేగా, ముగ్గురుండి ప్రజలకు చేసిన మేలంటూ ఏమీ లేదని, రాష్ట్రం అటుంచి కనీసం రాజంపేట పార్లమెంటును కూడా అభివృద్ధి చేసుకోలేని అభివృద్ధి నిరోధకులు అని ఎద్దేవా చేశారు. వీరు అధికారంలో భూకబ్జాలకు, అటవీ భూముల ఆక్రమణలకు, అనేక స్కాంలకు పాల్పడి వేల కోట్లు సంపాదించారని ఆరోపించారు. కాగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరిపై, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌పై ఎంపీ మిథున్‌రెడ్డి అనుచిత పదజాలాన్ని ఉపయోగించి పార్లమెంట్‌లో విమర్శించడాన్ని తాము తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. వెంటనే బీజేపీ నేతలకు ఎంపీ మిథున్‌రెడ్డి క్షమాపణ చెప్పాలన్నారు. రాజంపేట ప్రాంతంలో ఎన్నో ఏళ్లుగా ఆగుతున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లు కరోనా నుంచి ఆపకపోతే వాటిని ఆపించుకోలేని మిథున్‌రెడ్డి ఏం అభివృద్ధి చేస్తారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మైనార్టీ మోర్చ ఉపాధ్యక్షుడు షబ్బీర్‌అహ్మద్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రిష్ణయాదవ్, తోట రేవంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు

దరఖాస్తుల ఆహ్వానం

కలికిరి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మహాత్మజ్యోతీబా పూలే బీసీ గురుకుల పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ జారీ అయ్యింది. బీసీ గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్, పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు పంపుకోవాలని కలికిరి బాలికల బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనరు వై.సోమశేఖర్ తెలిపారు. అంతేగాకుండా 6, 7, 8, 9వ తరగతుల్లో అందుబాటులో ఉన్న బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం కూడా దరఖాస్తులు పంపుకోవచ్చని తెలిపారు. చిత్తూరు జిల్లాలోని సదుం బాలుర జూనియర్ కళాశాలతోపాటు సదుం, కుప్పం (బాలురు), పెద్దపంజాణి, పులిచెర్ల (బాలికలు) బీసీ గురుకుల పాఠశాలల్లోనూ, తిరుపతి జిల్లాలోని సత్యవేడు, ఐతేపల్లె (బాలురు) ఉదయమాణిక్యం (బాలికలు) పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు పంపుకోవా లన్నారు. అదే విధంగా అన్నమయ్య జిల్లాకు సంబంధించి తంబళ్లపల్లె (బాలురు), కలికిరి, పీలేరు (బాలికలు) పాఠశాలల్లో కూడా ప్రవేశాలున్నాయని సోమశేఖర్ వివరించారు. వీటన్నిటిలోనూ అందుబాటులో ఉండే బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం కూడా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఈ నెల 15 నుంచి మార్చి 15వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని కోరారు. ఆయా పాఠశాలలు, కళాశాలల వారీ అందుబాటులో ఉన్న సీట్ల వివరాలు కూడా ఆన్‌లైన్ ఉన్నాయని తెలిపారు. జూనియర్ ఇంటర్ ప్రవేశాలకు ఏప్రిల్ 20న, 5వ తరగతి ప్రవేశాలకు 27న, బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి 28న ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థుల తల్లిదండ్రుల ఆదాయం రూ.లక్షకు మించకూడదన్నారు. సంబంధిత జిల్లాలోని ప్రభుత్వ లేదా ప్రైవేటు పాఠశాలల్లో చదవుతూ ఉండాలన్నారు. ఇతర వివరాలు లేదా సందేహాల కోసం 90007 15637. 87900 92069, లేదా 79894 45396 నంబర్లలో సంప్రదించాలని కన్వీనరు సోమశేఖర్ కోరారు.

శ్రీరామ ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధరిస్తాం

- టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు


మినీ గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట చెరువుకు నీరందించే శ్రీరామ ఎత్తిపోతల పథకాన్ని రూ.11 కోట్లతో మరమ్మతులు చేయించి శాశ్వతంగా ఇనుప పైపులు వేయించి చెరువుకు శాశ్వతంగా నీరందించేలా చేస్తామని, ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని, రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. ఒంటిమిట్ట మండలం చిన్నకొత్తపల్లె గ్రామంలో మినీ గోకులాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒంటిమిట్ట మండలం అంటే సీఎం చంద్రబాబు నాయుడుకు ఎంతో ఇష్టమని, అందువల్లే గతంలో ఒంటిమిట్ట కోదండ రామాలయాన్ని రాష్ట్ర భద్రాద్రిగా ప్రకటించి రూ.100 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారన్నారు. త్వరలో నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, సీఎం చంద్రబాబుతో మాట్లాడి వెంటనే శ్రీరామ ఎత్తిపోతల పథకానికి నిధులు విడుదల చేయిస్తామన్నారు. మండల టీడీపీ సీనియర్ నాయకులు, రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కొమరా వెంకటనసరయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చిన్నకొత్తపల్లె గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకులు కట్టా సుబ్బరాయుడు, కట్టా వెంకటరమణ, ఎంపీడీవో ప్రసాద్, ఏపీవో శివశంకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సుబ్బమ్మ, మహబూబ్‌బాషా, సర్పంచ్ మామిళ్ల శ్రీహరి, ఈశ్వరయ్య, న్యాయవాది రామదాసు తదితరులు పాల్గొన్నారు.

దర్గాను సందర్శించిన సినిమా డైరెక్టర్ కృష్ణవంశీ


కృష్ణవంశీకి పుస్తకాన్ని అందజేస్తున్న సత్యమయ్య స్వామి

రామాపురం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలకంఠ్రావుపేట పంచాయతీ శ్రీసాయినగర్‌లో వెలసిన శ్రీసద్గురు దర్గా మాతాజీలను గురువారం సినిమా డైరెక్టర్ కృష్ణవంశీ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన దర్గా స్వామిని, దర్గా మాతాజీని గుర్తు చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామిజీ భక్తుడు సత్యమయ్య శ్రీదర్గా స్వామీజీ జీవిత చరిత్రకు సంబంధించిన బుక్స్‌ను వారికి అందజేశారు.

అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం

- పలు నిర్మాణాల కూల్చివేత
- కూల్చివేతలను స్వయంగా పర్యవేక్షించిన కలెక్టర్
- ప్రభుత్వ భూములను చెరబడితే కఠిన చర్యలు
- కలెక్టర్ చర్యలతో అక్రమార్కుల గుండెల్లో గుబులు


పీలేరు-తిరుపతి రోడ్డులోని హెరిటేజ్ డెయిరీ వద్ద ఉన్న అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న రెవెన్యూ సిబ్బంది

పీలేరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణంలో పేట్రేగిపోతున్న అక్రమార్కుల భరతం పట్టాలన్న లక్ష్యంతో గురువారం కలెక్టర్ చామకూరి శ్రీధర్ పీలేరుకు వచ్చారు. పీలేరుకు వచ్చీ రావడంతోనే స్థానిక నాగిరెడ్డి కాలనీలోని సర్వే నెం.72/2లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను పరిశీలించి నిర్మాణదారులను సుతిమెత్తగా హెచ్చరిస్తూనే రెవెన్యూ అధికారులకు సహకరిస్తే భవిష్యత్తులో ఏదైనా సాయం చేస్తానని భరోసా కల్పించారు. దీంతో అప్పటి వరకు అక్కడి నుంచి కదలడానికి ససేమిరా అన్న నిర్మాణదారులు స్వచ్ఛందంగా తప్పుకున్నారు. వారి రికార్డులు పరిశీలించి వివాదాస్పదం కాకుంటే ప్రభుత్వ నిబంధనల మేరకు వారి భూమిని క్రమబద్ధీకరించమని తహసీల్దారు భీమేశ్వర రావును ఆదేశించారు. అక్కడి నుంచి పీలేరు-తిరుపతి మార్గంలోని ఎర్రగుంటపల్లె పంచాయతీ సర్వే నెం.741లో వెలసిన అక్రమ నిర్మాణాల వైపు కదిలారు. తన వెంట ఎక్స్‌కవేటర్ పెట్టుకున్న ఆయన స్థానిక అధికారులను వాటిని కూల్చివేయాలని ఆదేశించారు. ఆ సర్వే నెంబరులో ఉన్న మూడు అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ఇక అక్కడి నుంచి తలపుల గ్రామం సమీపంలో ఉన్న ఉలవల గంగమ్మ గుట్టలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ, అటవీ, పోరంబోకు భూములను పరిశీలించారు. రెవెన్యూ రికార్డులు పరిశీలించి అవి ఆక్రమణకు గురయ్యాయని నిర్ధారించుకున్న తరువాత వాటిని సైతం కూల్చివేయమన్నారు. కూల్చివేతలను స్వయంగా దాదాపు మూడు గంటలసేపు ఎండలో నిలబడి మరీ పర్యవేక్షించారు. దాదాపు 18 ఎకరాల భూమి అన్యాక్రాంతం అయిపోతున్నా ఇన్నాళ్లూ ఎందుకు పట్టించుకోలేదంటూ స్థానిక సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ భూముల్లో వెలసిన ఇళ్లు, చుట్టూ వేసిన కంచె, ఏర్పాటు చేసుకున్న ట్రాన్స్‌ఫార్మర్లు, నీటి బోర్లను సైతం తొలగింపజేశారు. అనంతరం తిరుగుప్రయాణంలో పీలేరు-కోటపల్లె మార్గంలో నిర్మితమవుతున్న ఓ బహుళ అంతస్థుల భవంతిని సైతం కూల్చి వేయించారు. సాధారణంగా అక్రమ నిర్మాణాలను గుర్తించిన అనంతరం చర్యలు తీసుకోవాలని ఆదేశించి ఉన్నతాధికారులు వెళ్లిపోతుంటారు. అందుకు భిన్నంగా కలెక్టర్ వ్యవహరించారు. స్థానిక అధికారులకు ఏవైనా ఒత్తిళ్లు ఎదురవుతాయేమోనని భావించి వాటిని పూర్తిగా తొలగించే వరకు తానే స్వయంగా పర్యవేక్షించారు. ఆక్రమణల తొలగింపులో కేవలం నిబంధనలు పాటించకుండా మానవతా దృక్పథంతో వ్యవహరించారు. తిరుపతి మార్గంలోని ఓ అక్రమ భవనంలో హోటల్ నడుపుకుంటున్న వారు సామాన్లు చేరవేసుకునేందుకు రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వ భూమి అని తెలియక ఇతరుల వద్ద కొనుగోలు చేసిన వారికి సాయం చేస్తానని ప్రకటించారు. ఉద్దేశ్యపూర్వకంగా ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న వారిపై ఉక్కుపాదం మోపారు.


పీలేరు నాగిరెడ్డి కాలనీలో నిర్మాణదారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

మండల సర్వేయర్‌పై ఆగ్రహం

పీలేరు పట్టణం నాగిరెడ్డి కాలనీలోని సర్వే నెం.72/2 వ్యవహారంలో అత్యుత్సాహం ప్రదర్శించారంటూ పీలేరు మండల సర్వేయర్ కిరణ్మయిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దారుకు సమాచారం లేకుండా, ఆయన అనుమతి తీసుకోకుండా అక్కడ నిర్మాణదారుల విజ్ఞప్తి మేరకు భూమిని సర్వే చేయడం, స్కెచ్ అందజేయడం తప్పని మందలించారు. భవిష్యత్తులో అటువంటివి జరగకుండా చూసుకోవాలని హెచ్చరించారు. ప్రభుత్వ భూముల్లోని ఆక్రమణల తొలగింపు పూర్తయిన తరువాత పట్టణంలోని రోడ్లపై ఉన్న ఆక్రమణలను తొలగించాలని పీలేరు ఈవో గురుమోహన్‌ను ఆదేశించారు. ఆక్రమణల కారణంగా పట్టణంలోని రోడ్లన్నీ ఇరుకుగా మారి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని, స్థానికులకు అవగాహన కల్పించి ఆక్రమణలను తొలగించాలన్నారు. దీంతో ఈవో గురువారం సాయంత్రం పట్టణంలోని దుకాణదారులను ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. కొన్ని ఆక్రమణలను అప్పటికప్పుడు తొలగించగా మరికొన్నింటిని రెండు, మూడు రోజుల్లో తొలగించాలని తెలియజేశారు. ఆక్రమణల తొలగింపులో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దారు భీమేశ్వరరావు, మండల సర్వేయర్ కిరణ్మయి, ఎస్ఐ లోకేశ్, వీఆర్వోలు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల అభియోగాలపై కలెక్టర్ సీరియస్

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): భూముల మ్యుటేషన్లు చేస్తామంటూ డబ్బుల వసూళ్లకు దిగిన రెవెన్యూలో 20 మంది ఉద్యోగుల అభియోగాలపై కలెక్టర్ కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ సీరియస్ అయ్యారు. ఇంటరాక్టివ్ రెస్పాన్స్ సర్వీసెస్ (ఐవీఆర్ఎస్)ద్వారా భూముల మ్యుటేషన్లకు సిఫారసు చేసే విషయంలో జిల్లాలో పనిచేస్తున్న 15మంది వీఆర్వోలు, ఇద్దరు రెవెన్యూ ఇన్ స్పెక్టర్లు, ముగ్గురు సర్వేయర్లు రైతుల నుంచి డబ్బుల వసూళ్లకు దిగారంటూ కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో హెచ్చరిస్తూ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రెవెన్యూలో ఉద్యోగులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ఇలాంటి అభియోగాలు మళ్లీ వస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించినట్లు జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

● డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో ఉద్యోగాలిప్పిస్తామంటూ దళారులు చెప్పే మాయ మాటలను నమ్మి మోసపోవద్దని డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు.

గత ఏడాది వైద్యశాఖలో నోటి ఫికేషన్ నెంబరు 2023/జూన్‌లో ఒప్పందం ప్రకారం స్టాఫ్ నర్సుల ఉద్యోగాలను భర్తీ చేసేందుకు దరఖాస్తులు స్వీకరించామన్నారు. మెరిట్ లిస్ట్‌ను కడప.ఏపీ. జీవో వి.ఇన్‌లో అప్లోడ్ చేశామన్నారు. మెరిట్ లిస్టు ఆధారంగా అశోక్‌కుమార్ అనే వ్యక్తి 9038108948, 9951465818 ఫోన్ నెంబర్ల ద్వారా ఉద్యోగాలిప్పిస్తానంటూ ఫోన్ పే ద్వారా డబ్బులు వసూలు చేస్తున్నట్లు అభ్యర్థులు ఫిర్యా దులు చేశారన్నారు. ఇలా ఉద్యోగలిప్పిస్తామని మోసా లకు పాల్పడే వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని, నోటిఫికేషన్ గడువు కూడా ముగిసిందని, ఎవ్వరి మాట లు నమ్మి మోసపోవద్దని డీఎంహెచ్‌ఓ పేర్కొన్నారు.

జొన్న సొప్ప దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

జమ్మలమడుగు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో గురువారం మధ్యాహ్నం ప్రధాన రోడ్డుపై ట్రాక్టర్‌లో తీసు కెళుతున్న జొన్న సొప్ప దగ్ధమైంది. ముద్దనూరు మండలం గంగాదేవిపల్లెకు చెందిన ఇద్దరు రైతులు జమ్మలమడుగు మండలం ఎస్.ఉప్పలపాడు గ్రామ పొలాల్లో జొన్నగడ్డి కొనుగోలు చేసి తరలిస్తున్నారు. ఈ క్రమంలో జమ్మలమడుగు పాత బస్టాండు వద్ద స్థానికులు టపాసులు పేలుస్తుండగా జొన్న సొప్ప ట్రాక్టర్‌పై పడటంతో మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అయితే అప్పటికే సొప్ప అంతా కాలిపోయింది. దీంతో బాధిత రైతులు తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ... ఇద్దరికి తీవ్ర గాయాలు

నందలూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కడప - చెన్నై జాతీయ రహదారిలో మూసివేసిన ఆల్విన్ కర్మాగారం వద్ద గురువారం తెల్లవారుజామున బైకుపై వెళుతున్న ఇద్దరు యువకులను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. రాజంపట పట్టణంలో వివాహ కార్యక్రమానికి నందిమండలం సునీల్, నందిమండలం రమేష్ హాజరై తిరిగి వెళుతున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. గాయపడినవారిని వెంటనే 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హత్యాయత్నం కేసులో భార్యాభర్తలకు జైలు శిక్ష



శిక్షపడ్డ అయ్యావారయ్య, వీరమ్మ దంపతులు

సిద్దవటం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం పోలీసు స్టేషన్ పరిధిలో 2015లో జరిగిన హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితులకు ఐదేళ్ల జైలుశిక్ష, జరిమానా విధిస్తూ బద్వేల్ అడిషనల్ అసిస్టెంట్ సెషన్ జడ్జి పద్మశ్రీ తీర్పు వెలువరించారు. వివరాలిలా.. వంతాటిపల్లె గ్రామానికి చెందిన అయ్యావారయ్య(40), వీరమ్మ దంపతులు సిద్దవటంలో నివాసం ఉంటున్నారు. వీరు ఇంటి దగ్గర చెత్త, మురికినీరు విషయమై చీదెళ్ల సుజాత అనే మహిళతో గొడవపడి... ఆమెపై కత్తితో దాడిచేసి పొడిచారు. ఈ కేసుకు సంబంధించి గురువారం బద్వేలు అడిషనల్ అసిస్టెంట్ సెషన్ కోర్టులో విచారణకు రాగా నేరం రుజువు కావడంతో నిందితులకు ఐదేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చినట్లు ఇన్‌చార్జి ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు.

స్కూటర్ ఢీ.. ఒకరి మృతి

ఖాజీపేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కడప-కర్నూలు జాతీయ రహదారిలోని భూమాయపల్లె వద్ద స్కూటర్ ఢీకొన్న సంఘటనలో గూడతిరెడ్డి అరుణ (51) మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు... మండల పరిధిలోని భూమాయపల్లెలో జరిగే వివాహం కోసం హైదరాబాదు నుంచి వచ్చి భూమాయపల్లె వద్ద దిగి రోడ్డు క్రాస్ అవుతుండగా స్కూటర్ ఢీకొనడంతో తలకు తీవ్రగాయలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మోహన్ తెలిపారు.

పరిహార పంపిణీ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలి

● కలెక్టరు చెరుకూరి శ్రీధర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్

బద్వేలు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): బద్వేలు డివిజన్ పరిధిలో బెంగళూరు-విజయవాడ జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయే బాధితులకు త్వరగా పరిహారం పంపిణీ ప్రక్రియ పూర్త య్యేలా చూడాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదేశించారు. గురువారం ఆర్డీఓ కార్యాలయంలో డివిజనల్ స్థాయిలో మండల తహసీల్దార్లు, నేషనల్ హైవే అధికారులతో సమీక్షించిన ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా వివిధ ప్యాకేజీల్లో ఆయా మండలాల్లో పెండింగులో ఉన్న భూసేకరణ, అవార్డు పంపిణీ, కోర్టు పెండింగు పనులు, భూములు కోల్పోయిన బాధితులకు త్వరగా పరిహార పంపిణీ ప్రక్రియ పూర్తికావాలన్నారు. బద్వేలు రెవెన్యూ డివిజను పరిధిలో ఉన్న 9 మండలాల్లో ఇప్పటి వరకు నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 3778 ఫిర్యాదులు అందాయని, 1131 ఫిర్యాదులకు పరిష్కారం చూపామన్నారు. రీసర్వే గ్రామసభల్లో కూడా ఇప్పటికీ చాలా ఫిర్యాదులకు ఎందుకు పరిష్కారాలు చూపలేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం 8గంటలకు ఫీల్డ్ విజిట్ వెళ్లాలని, సంబంధిత అధికారులు రికార్డులు తమ వెంట తీసుకెళ్లి టార్గెట్ నిర్దేశించుకుని వచ్చిన ఫిర్యాదులకు పరిష్కారం చూపాలని తహసీల్దార్లను ఆదేశించారు. అనంతరం రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో రెవెన్యూ సిబ్బంది వివరాలు క్షేత్రస్థాయిలో సమస్యలను అధికారుల ద్వారా పూర్తిగా తెలుసుకున్నారు. కార్యక్రమంలో బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్, డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, నేషనల్ హైవే అధికారులు రెవెన్యూశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయ విద్యాలయాలను పటిష్టంగా నిర్వహించాలి

● డీఆర్‌వో మధుసూదన్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌వో మధుసూదన్‌రావు

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేస్తూ జవహర్ నవోదయ విద్యాలయాలను పటిష్టంగా నిర్వహించాలని డీఆర్‌వో మధుసూదన్‌రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రాయచోటి కలెక్టరేట్‌లో మినీ వీసీ హాలులో కలెక్టర్ చామకూరి శ్రీధర్, డీఆర్‌వో అధ్యక్షతన జవహర్ నవోదయ విద్యాలయాలకు సంబంధించి మేనేజ్మెంట్, అడ్వైజరీ కమిటీ, జిల్లా స్థాయి ఆహార కమిటీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జవర్‌హర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటు, పనితీరు, నిర్వహిస్తున్న తరగతులు, ఎంపిక విధానం, విద్యార్థుల సంఖ్య, అకడమిక్ కార్యక్రమాలు, లైబ్రరీ, ల్యాబులు, విజ్ఞాన్ జ్యోతి తదితరాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ గీత వివరించారు. అనంతరం డీఆర్‌వో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి ఎంపికైన ప్రతిభావంతులైన పిల్లలకు వారి కుటుంబ సామాజిక, ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా ప్రధానంగా సంస్కృతి, విలువల పెంపుదల, పర్యావరణంపై అవగాహన, సాహస కార్యకలాపాలు, నాణ్యమైన ఆధునిక విద్యను అందించాలని నవోదయ విద్యాలయ ఉపాధ్యాయు లు, టీచర్లకు సూచించారు. సమావేశంలో నారమరాజుపల్లి వైస్ ప్రిన్సిపల్ గంగాధరన్, ఆర్‌అండ్‌బీ ఈఈ సహదేవరెడ్డి, అడిషనల్ డీయంహెచ్‌వో ప్రశాంతి, డీపీఆర్‌వో పురుషోత్తం, డీఎస్‌వో రఘురాం, డిప్యూటీ డీఈవో శివప్రకాశ్‌రెడ్డి, విద్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌లో దొంగతనం

● గుట్టుచప్పుడు కాకుండా రికవరీ ● ఆలస్యంగా వెలుగుచూసిన వైనం

ఖాజీపేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఖాజీపేట పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్‌కు దొంగలవద్ద నుంచి రికవరీ చేసిన 14 కేజీల రాగివైరుపై కన్నుపడింది. ఎవరు కనుక్కోలేరని మోసపోయాడు. అయితే స్టేషన్‌లో సీసీ కెమెరాలు పరిశీలించడంతో ఆ కానిస్టేబుల్ బండారం బయటపడింది. పోలీసుస్టేషన్‌లో దొంగతనం జరిగిందంటే ప్రజలకు చెడు సంకేతాలు పోతాయని గుట్టుచప్పుడు కాకుండా రాగివైరును రికవరీ చేసి స్టేషన్‌లో ఉంచారు. ఈ సంఘటన వారం రోజుల తర్వాత వెలుగులోకి రావడంతో ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ఈ విషయంపై సీఐని వివరణ కోరగా కానిస్టేబుల్ రాగివైరు చోరీ చేశారని, డీఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆదేశాల మేరకు ఇడమడక చెక్‌పోస్టుకు పంపడం జరిగిందన్నారు. జిల్లా ఎస్పీకి నివేదిక ఇచ్చామని, వారి ఆదేశాలమేరకు చర్యలు తీసుకుంటామని సీఐ మోహన్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై వెళుతూ ఎదురుగా సైకిల్ మీద వచ్చే ఇద్దరు బాలురను తప్పించబోయి రోడ్డు మధ్యలో వున్న డివైడర్‌ను ఢీకొనడంతో కింద పడగా మరోబైక్ తొక్కించుకుంటూ పోవడంతో తన్వీర్ (15) అనే బాలుడు మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. అమృతనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ షేక్ ఖాదర్‌బాషా కుమారుడు తన్వీర్ చదువు మానేసి ప్రొద్దుటూరు శివాలయం సర్కిల్‌లోని పండ్ల దుకాణంలో పనిచేసేవాడు. బుధవారం మధ్యాహ్నం యజమాని భగత్ సింగ్‌కాలనీలోని తన ఇంటి వద్ద నుంచి భోజనం తీసుకురమ్మని చెప్పాడు. బైక్‌లో వెళుతుండగా పాలిటెక్నిక్ కాలేజీ దగ్గరకు వచ్చేసరికి ఎదరుగా సైకిల్ మీద వస్తున్న ఇద్దరు బాలురను తప్పించబోయి డివైడర్‌ను ఢీకొనడంతో కింద పడ్డాడు. అదే సమయంలో వేగంగా వస్తున్న మరో బైక్ తన్వీర్‌ను తొక్కించు వెళ్లడంతో తీవ్రగాయాలయ్యాయి. ఆసుపత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ట్రాఫిక్ సీఐ దేవకిరణ్ కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. తన్వీర్ మృతదేహాన్ని గురువారం పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు.

లారీ ఢీకొనడంతో వ్యక్తి..



నాగేంద్ర (ఫైల్)

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సింహాద్రిపురం మండలం బలపనూరు గ్రామానికి చెందిన ఎల్లమ్మగారి నాగేంద్ర (45) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వివరాలిలా.. పులివెందుల నుంచి బలపనూరు వెళుతున్న నాగేంద్రను ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నాగేంద్ర జేసీబీతో పనులు చేయించేవాడు. రోజువారి నిమిత్తం జేసీబీ పనిముట్ల కోసం పులివెందులకు వచ్చి తిరిగి బలపనూరు వెళుతుండగా స్థానిక ఆర్డీవో కార్యాలయం సమీపంలో గురువారం రాత్రి 8గంటల సమయంలో రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానిక ప్రజలు 108కు సమాచారం అందించగా వారు వచ్చినా అంతలోపే నాగేంద్ర మృతి చెందడం జరిగింది. మృతునికి భార్య కుమార్తె, కొడుకు ఉన్నట్లు ఆ గ్రామ ప్రజలు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న పులివెందుల ట్రాఫిక్ సీఐ హాజీవల్లి తన సిబ్బందితో సంఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతుని వివరాలు తెలుసుకుని వారి బంధువులకు సమాచారం అందించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు.

అబార్షన్‌లు చేస్తే చర్యలు



అబార్షన్‌లపై ఆడిట్ నిర్వహిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శివప్రసాద్

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్ల పుడుతుందని అవరసరం లేకున్నా అబార్షన్ చేస్తే చర్యలు తప్పవని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శివప్రసాద్ హెచ్చరించారు. గురువారం స్థానిక పీపీ యూనిట్ జిల్లా ఆస్పత్రిలో జమ్మలమడుగు డివిజన్ పరిధిలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రైవేటు ఆస్పత్రుల్లో జరిగే అబార్షన్‌లపై ఆడిట్ నిర్వహించారు. ఆడపిల్ల పుడుతుందని మొదటి , రెండో కాన్పుల్లో ఆడపిల్లలు పుట్టిన వారు ఈ అబార్షన్‌లు చేయించుకుంటున్నారన్నారు, ఆడిట్ చేసి ఎక్కడ అబార్షన్‌లు చేయించుకుంటున్నారో విచారించి సంబంధింత ప్రైవేటు ఆస్పత్రులపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో గైనకాలజిస్టు డాక్టర్ కావ్య, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్స్ ఎక్సైజ్ సీఐ కార్యాలయం తనిఖీ

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల ఎక్సైజ్ సీఐ కార్యాలయాన్ని రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం తనిఖీలు చేసి రికార్డులను పరిశీలించారు. ఎర్రగుంట్లలో మద్యం అధిక రేట్లు, సమయపాలనపై వారు ఆరా తీశారు. వీటిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించినట్లు సమాచారం. ఎక్సైజ్ ఈఎస్ మధుబాబు, ఇద్దరు సీఐలు పాల్గొన్నట్లు తెలుస్తోంది. ఈవిషయంపై స్థానిక ఎక్సైజ్ సీఐ గోపీక్రిష్ణను వివరణ కోరేందుకు ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు.

జూదరుల అరెస్టు

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని వెంకటాపురం గ్రామ పొలాల్లో జూద స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. గురువారం మధ్యాహ్నం అందిన సమాచారం మేరకు పట్టణ సీఐ నరసింహులు ఆధ్వర్యంలో పోలీసులు అరటి తోటలో జూద మాడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని 9 వాహనాలను, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నరసింహులు తెలిపారు. అరెస్టు అయిన వారి నుంచి రూ.35వేలు నగదు స్వాధీనం చేసుకున్నామని సీఐ వెల్లడించారు. మధ్యాహ్నం సంఘటన జరిగితే సాయంత్రం వరకు అధికార పార్టీ నాయకుల వత్తిడితో మీడియాకు వెల్లడించకుండా దాచడంపై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

● రికవరీ రూ.2,75,504... జరిమానా రూ.53,000



సామాజిక తనిఖీ బహిరంగ వేదికపై నివేదికలు పరిశీలిస్తున్న అడిషనల్ పీడీ నాగరత్నమ్మ

కాశినాయన ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకంలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డ్వామా అడిషనల్ పీడీ నాగరత్నమ్మ హెచ్చరించారు. గురువారం నర్సాపురం ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణలో ఎంపీడీఓ మైథిలీరెడ్డి అధ్యక్షతన ఉపాధి పథకంపై 19వ సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం నిర్వహించారు. వారం రోజులుగా ఎస్ఆర్‌పీ భాస్కర్ అధ్వర్యంలో గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందాలు చేపట్టిన విచారణలో వెలుగు చూసిన పలు అంశాలపై నివేదికలు అధికారుల ముందు సభలో చదివి వినిపించారు. అనంతరం ఎంపీడీఓ మీడియాతో మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరంలో 1005 పనులకు ఉపాధి పథకంలో రూ.9,96,30,430 ఖర్చు చేశామన్నారు. వీటిపై సామాజిక తనిఖీ బృందం చేపట్టిన విచారణలో తేలిన అంశాలపై అధికారులు పరిశీలించి రూ.2,75,504 రికవరీ చేశారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన ఇటుకులపాడు, వరికుంట్ల, ఆకుల నారాయణపల్లె, నర్సాపురం ఫీల్డ్ అసిస్టెంట్‌లను విధుల నుంచి తొలగించారన్నారు. మరి కొంతమంది సిబ్బందిపై రూ.53000 వరకు జరిమానా విధించారని తెలిపారు. గొంటువారిపల్లె, కత్తెరగండ్ల, రెడ్డికొట్టాల ఫీల్డ్‌అసిస్టెంట్‌లు రాజీనామా చేశారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి రామలింగేశ్వర్‌రెడ్డి, క్వాలిటీ కంట్రోల్ ఈఈ విజయభాస్కర్, ఏపీడీ ఆనంద్, స్థానిక సర్పంచ్ ఖాజావలి, ఇన్‌చార్జి ఏపీఓ నాగేంద్రప్రతాప్, మండల టీడీపీ నేతలు బసిరెడ్డి రవీంద్రారెడ్డి, పోలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డీటీసీ కె.ప్రసాద్

సికెదిన్నె, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై వాహనం నడిపేటప్పుడు డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి డీటీసీ కె.ప్రసాద్ తెలిపారు. స్థానిక ఉపరవాణా శాఖ కార్యాలయంలో గురువారం ఆటో డ్రైవర్లకు 36వ జాతీయ రహదారి భద్రత సందర్భంగా అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని, వాహనాలను ఎక్కడపడితే అక్కడ నిలిపి ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా చూడాలన్నారు. డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ కలిగి ఉండాలన్నారు. ప్రయాణికులను సామర్థ్యం మేరకే వాహనంలో ఎక్కించుకోవాలన్నారు. ట్రాఫిక్ సీఐ జావీద్ మాట్లాడుతూ చిన్నపిల్లలు, ఇతరులకు ఆటోలను బాడుగకు ఇచ్చి ప్రమాదాలను కొని తెచ్చుకోవద్దన్నారు. ఆటోలపై భారీ లగేజీలు వేసి ఇతరులకు ఇబ్బంది కలిగించవద్దన్నారు. ట్రాఫిక్ నియమాలను పాటించి ప్రమాదాలను నివారించాలన్నారు. కార్యక్రమంలో రవాణాశాఖ ఇన్‌స్పెక్టర్ విజయభాస్కర్, ప్రసాద్, శ్వేత, లక్ష్మీప్రసన్న ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ అరుణ్‌రెడ్డి, ఏపీఎస్ఆర్‌టీసీ డీఎం డిల్లీరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌పై ఆరోపణలు.. పూర్తి స్థాయి విచారణ

● జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి సురేశ్‌కుమార్



పట్టుబడిన రేషన్ బియ్యాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్, జిల్లా బీసీ సాంఘిక సంక్షేమ అధికారి

గాలివీడు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్థానిక బీసీ బాలుర వసతి గృహంలో బియ్యం దారి మళ్లిస్తున్నారంటూ విద్యార్థి సంఘం నాయకులు చేసిన ఆరోపణలపై పూర్తిస్థాయి విచారణ జరిపి నివేదికలు కలెక్టర్‌కు పంపనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి సురేశ్‌కుమార్ తెలిపారు. గురువారం తహసీల్దార్ భాగ్యలతతో కలిసి ఆయన బీసీ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాస్టల్ సిబ్బంది రెండు బస్తాల బియ్యం విక్రయిస్తున్నారంటూ ఆరోపిస్తూ ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోషియేషన్ జిల్లా కార్యదర్శి లవకుమార్ తమకు చరవాణిలో ఫిర్యాదు చేశారన్నారు. దీంతో బీసీ హాస్టల్‌ను సందర్శించగా రెండు బస్తాలు రేషన్ బియ్యం అదనంగా ఉండటం గుర్తించామన్నారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపిన అనంతరం కలెక్టర్ ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, సతీశ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

ఆప్కాస్ నుంచి తొలగించవద్దు



కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, ఇంజనీరింగ్ విభాగం కార్మికులను ఆప్కాస్ నుంచి తొలగించవద్దని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు చంటి, కార్యదర్శి సాల్మన్ డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త పిలుపుమేరకు మూడో రోజు మున్సిపల్ వర్క ర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 36జీఓను అమలు చేయాలని కోరుతూ ఆప్కాస్‌ను కొనసాగిస్తేనే కార్మికుల ఉద్యోగాల కు భద్రత వుంటుందన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కార్మికులు మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులకు స్కిల్డ్ సెమీ, స్కిల్డ్ వేతనాలు అమలు చేయ డం లేదన్నారు. ఆఫీసులో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూడా రూ.15 వేల జీతం ఇస్తున్నారన్నారు. అందులో 2000 వేలు ఈపీఎఫ్, ఈఎస్‌ఐకి పోతే రూ.13000వేలతో కుటుంబం నెట్టుకురావడం కష్టంగా వుందన్నారు. ఇంజనీరింగ్ సెక్షన్ కార్మికులకు వర్క్ ఇన్ స్పెక్టర్లకు వారి విద్యార్హతను బట్టి స్కిల్డ్ జీతా లు అమలు చేయాలన్నారు. రిటైర్డ్ అయ్యాక ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఎలాంటి బెనిఫిట్స్ రావన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్ కింద రూ.5 లక్షలు ఇవ్వాల ని డిమాండ్ చేశారు. ఔట్ సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగుల కు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింప చేయాలన్నారు. ఆప్కా స్‌ను రద్దుచేస్తే తిరిగి మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులకు ఉద్యోగ భద్రత వుండదన్నారు. కాబట్టి ఆప్కాస్ ను రద్దు చేసేలాగైతే వీరినంతా రెగ్యులర్ చేయాలన్నారు. అనంతరం కమిషనర్ మల్లికార్జునకు వినతి పత్రం అందజేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ ఆచారి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కోశాధికారి రాఘవేంద్ర, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కార్మికులు బీటెక్ శివ, ఎం. పద్మ, వెంకటేష్, గుర్రప్ప, గంగాధర్‌రెడ్డి, గౌడ్, శివ, మహ్మద్, బాలాజీ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన శ్రీరామ్‌చినబాబు



మదనపల్లె, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజకీయ, నియోజకవర్గ సమస్యలను ఆయన ముఖ్యమంత్రికి వివరించడంతోపాటు పలు సమస్యలు పరిష్కరించాలంటూ వినతి పత్రం ద్వారా విన్నవించారు.

బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల గడువుపెంపు

నిమ్మనపల్లి ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 50శాతం సబ్సిడీతో బీసీ కార్పొరేషన్ ద్వారా అందించనున్న రుణాల కొరకు దరఖాస్తు గడువును ఈ నెల 15వరకు పెంచినట్లు ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని బీసీ కార్పొరేషన్ కింద 50శాతం సబ్సిడీతో 45యూనిట్లు మంజూరు కాగా, ఒక్కో యూనిట్ రూ.2లక్షలుగా ఉందన్నారు. అలాగే కాపు కార్పొరేషన్ కింద 14యూనిట్లు మంజూరు కాగా రూ.2లక్షల వంతున ఇద్దరికి, రూ.3లక్షల వంతున 7మందికి, రూ.5లక్షల వంతున 5మందికి మంజూరైనట్లు తెలిపారు. ఈబీసీ కేటగిరీల్లో 2యూనిట్లు మంజూరు కాగా ఇద్దరికి రూ.1,75వేలు, రెడ్డి సామాజిక వర్గానికి 2యూనిట్లు మంజూరు కాగా వాటిలో ఇద్దరికి రూ.1.75వేలు మంజూరు అయినట్లు తెలిపారు. లబ్ధిదారులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుచేసుకోవాలని తెలిపారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు : ఆర్ఐవో

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్ఐవో కృష్ణయ్య తెలిపారు. గురువారం మదనపల్లెలో జరుగుతున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్న ఐదు కళాశాలల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ నాయకులు చేసిన ఆరోపణలపై విచారణ నిర్వహించామని అవి నిరాధారణమైనన్నారు. జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు 49 సెంటర్లలో జరుగుతాయని, ప్రథమ సంవత్సరం 14,885 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం 13,065 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే పరీక్షలకు ఎగ్జామినర్లు 650 మంది అవసరమని, ఇందులో 550 మంది అధ్యాపకులు ఉండగా మిగిలిన వందమందిని సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులను ఎగ్జామినర్లుగా తీసుకుంటామని తెలిపారు. ఇంటర్ పరీక్షలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డీఈసీ మెంబరు అమరేంద్ర, ఎంఈవో ప్రభాకర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలి

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 13 (ఆంధ్ర జ్యోతి): రానున్న వేసవిని దృష్టిలో ఉంచు కుని రైతులకు ఉత్పన్నమయ్యే విద్యుత్ సమస్యలపై ట్రాన్స్‌కో సిబ్బంది తక్షణ చర్యలు చేపట్టాలని ట్రాన్స్‌కో ఏడీ గోవిందరెడ్డి ఆదేశించారు. గురువారం ఆయన మండల కేంద్రమైన పీటీఎంలోని విద్యుత్ ఉప కేంద్రంలో ట్రాన్స్‌కో ఏఈ రామలక్ష్మయ్యతో కలసి లైన్‌మాన్‌లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, హెల్పర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు విద్యుత్ సమస్యలపై కార్యాలయాలకు తిరగకుండా ఎప్పటికప్పుడు ఏఈలు గ్రామాల్లో వారికి అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, కేబుల్ వైర్లు, ప్రమాదస్థాయిలో ఉంటే అటువంటి వాటిని తక్షణం మార్పుచేసి నూతనంగా అమర్చాలన్నారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు ట్రాన్స్‌పార్మర్లును ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. రైతులకు విద్యుత్ సమస్యలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో లైన్‌మెన్, హెల్పర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా భూముల రీసర్వే : సబ్ కలెక్టర్



సబ్‌కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న స్థానికులు

బి.కొత్తకోట, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యో తి): మదనపల్లె డివిజన్‌లో భూముల రీసర్వే పారదర్శకంగా చేపడుతున్నామని మద నపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ పేర్కొన్నారు. గురువారం బి.కొత్తకోట మండలంలో ఆయన పర్యటించా రు. తహశీల్దార్ కార్యాలయంలో ఫ్రీహోల్డ్ భూములు, రెవెన్యూసదస్సు అర్జీలు, రీసర్వేలపై సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ బి.కొత్తకోట, మదనపల్లె రెవెన్యూ సదస్సులో అధికంగా 1023 అర్జీలు వచ్చాయన్నారు. బి.కొత్తకోట పట్టణంలో ఆక్రమణలు ఎక్కువయ్యాయని, ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి దౌర్జ న్యాలు చేస్తున్నారని కొందరు సబ్‌కలెక్టర్ లికిత పూర్వకంగా తగిన ఆధారాలతో నివేదించారు. తహశీల్దార్ అజారుద్దీన్, డీటీ మమమ్మద్ అన్సారీ, సరేకవయర్ ముబారక్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ రేడియో సేవలను వినియోగించుకోండి

కురబలకోట, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ప్రజలు మిట్స్ కమ్యూనిటీ రేడియో సేవలను వినియోగించుకోవాలని రిటైర్డ్ ఆకాశవాణి ఉద్యోగి మల్లేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ప్రపంచ రేడియో దినోత్సవ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సి.యువరాజ్, రాజేష్, అరవింద్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మదనపల్లె డివిజన్‌లో ఖాళీగా వున్న అంగన్‌వాడీ పోస్టులకు శుక్రవారం మదనపల్లె సబ్‌కలెక్టరేట్ ఆధర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మదనపల్లె సీడీపీవో ఎ.సుజాత పేర్కొన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ మదనపల్లె, తంబళ్లపల్లె, బి.కొత్తకోట, వాల్మీకిపురం ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీ అయిన అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్, మినీ అంగన్‌వాడీ పోస్టులకు ఇది వరకే నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులకు ఇంటర్వ్యూల కాల్‌లెటర్లు పంపామన్నారు. కాల్ లెటర్లు అందుకున్న అభ్యర్థులు ఈనెల 14న ఉదయం 9.30గంటలకు వారి ఒరిజినల్ సర్టిఫికేట్స్‌తో ఇంటర్వ్యూకు హాజరు కావాలని సీడీపీవో కోరారు.

వైభవంగా నలవీర గంగాభవానీ జాతర



నలవీరగంగాభవానీ అమ్మవారు, బోనాలు తెస్తున్న ప్రజలు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం, సీటీఎం గ్రామంలో వెలసిన నలవీరగంగాభవానీ అమ్మవారు జాతర గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో గంగమ్మకు ప్రత్యేక అలంకరణలు, అర్చనలు, అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. సీటీఎం గ్రామంలోని వివిధ పల్లెల నుంచి మహిళలు దీలుబోనాలు ఊరేగింపుగా తరలి వచ్చి అమ్మవారికి సమర్పించారు. ఈ జాతర ఆదివారం వరకు అత్యంతవైభవంగా నిర్వహించడానికి ఆలయకమిటీ సభ్యులు సీటీఎం సర్పంచ్ సగినాల ఆనందపార్థసారధి, వెలుగుచంద్ర, పారపట్ల సురేంద్రరెడ్డి, పొగాకు వీరప్రతాప్‌లు అన్ని ఏర్పాట్లు చేశారు. జాతరకు వచ్చే భక్తుల కోసం మదనపల్లె ఆర్టీసీ వారు 20 ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డీఎం మూరే వెంకటరమణారెడ్డి, అమరనాథ్‌లు తెలిపారు. మదనపల్లె డీఎస్పీ కొండయ్య నాయుడు ఆధ్వర్యంలో తాలుకా సీఐ కళావెంకటరమణ పర్యవేక్షణలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీని అనుసరించి ఆలయకమిటీ సభ్యులు మిలటరీ ట్రైనింగ్ విద్యార్థులను 30 మంది వలంటీర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సప్తవర్ణ శోభితం శ్రీవారి పుష్పయాగం



తంబళ్లపల్లె, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోసువారిపల్లెలో తొమ్మిది రోజుల పాటు వైభ వోపేతంగా సాగిన ప్రసన్న వేంకటరమణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం పుష్పయాగంతో ముగిసాయి. సాయంత్రం 5 గంటల నుంచి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవమూర్తులను పట్టువ స్త్రాలు, ఆభరణాలతో అలం కరించి పుష్పయాగం కనులపం డువగా నిర్వహించారు. ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి పుష్పయాగ ఉత్సవంలో పాల్గొని స్వామి వారిని దర్శించు కున్నారు. ఏఈవో గోపినాథ్, ఉపప్రధాన అర్చకులు సిబ్బంది నగేష్, భక్తులు పాల్గొన్నారు.

రైతు విశిష్ట సంఖ్య నమోదు చేసుకోండి

పెద్దమండ్యం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) ప్రతి రైతు విశిష్ట సంఖ్య నమోదు తప్పని సరిగా చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి బి. చంద్రానాయక్ పేర్కొన్నారు. పెద్దమండ్యం మండలంలో గురువారం పెద్దమండ్యం, బండ్రేవు, పాపేపల్లి రైతు సేవా కేంద్రాలలో జరుగుతున్న రైతు విశిష్ట సంఖ్య నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. పట్టదారు పాసు పుస్తకం ఉన్న రైతులందరు తప్పకుండా వారి పేరును నమోదు చేసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రైతులకు అందించే ఏ పథకంకైనా ఈ రైతు విశిష్ట సంఖ్య సంఖ్య ఉంటేనే అర్హులన్నారు. మండలశాఖ వ్యవసాధికారులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతుల కోసం ప్రత్యేక యూనిక్ కోడ్

కలికిరి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రైతులందరికీ ప్రత్యేకంగా 11 సంఖ్యలతో కూడిన యూనిక్ కోడ్ నంబరును కేటాయాస్తున్నదని మండల ఏవో మమతా రెడ్డి పేర్కొన్నారు. మండలంలో భూమి కలిగిన 8587 మంది రైతులుండగా ఇప్పటికి కేవలం 900 లోగానే రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని ప్రతి రైతూ ఈ నెలాఖరులోగా తప్పని సరిగా రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని ఏవో స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ కోసం వెళ్ళే రైతులు ఆధార్ కార్డు జిరాక్సు, ఆధార్‌తో లింక్ వున్న ఫోను, రీ సర్వే జరిగిన గ్రామాల రైతులు ఎల్‌పీ నంబర్లు, రీ సర్వే జరగని గ్రామాల రైతులు పట్టాదారు పానుపుస్తకం జిరాక్సు తీసుకురావాలని ఏవో కోరారు.

విద్యుదాఘాతంతో విద్యార్థికి గాయాలు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి):విద్యుత్ షాక్‌తో గురువర్ధన్(18) అనే విద్యార్థి గాయపడిన సంఘటన మదనపల్లె మండలం, వేంపల్లె గ్రామంలో చోటుచేసుకుంది. మదనపల్లె పట్టణం, ప్రశాంతనగర్‌కు చెందిన రామకృష్ణ కుమారుడు గురువర్ధన్ తన మిత్రులతో కలిసి ఓ మిత్రున్ని జన్మదిన వేడుకలను నిర్వహించడానికి వేంపల్లెకు వెళ్లారు. అక్కడ చెట్టు ఎక్కడంతో విద్యుత్ వైరు తలకు తగిలి కింద పడి గాయపడ్డాడు, వెంటనే మిత్రులు కలిసి చికిత్స కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఇల్లు కూల్చివేతను అడ్డుకున్న బాధితులు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం, చిప్పిలి బంగారుకొత్తపేటలో రెవెన్యూ అధికారులు, పోలీసులు ఎక్స్‌కవేటర్‌తో ఇల్లు కూల్చడానికి యత్నించగా బాధితురాలు ఈశ్వరమ్మ వర్గీయులు అడ్డుగా బైఠాయించి అడ్డుకున్నారు. కబ్జాలకు పాల్పడుతూ ఇల్లు కట్టుకున్నవారికి వివిధ సర్వే నెంబర్లల్లో మూడు ఇళ్లు ఉన్నాయని, ఐదుగురు అన్నదమ్ములు ఉన్నతాము 15 ఏళ్లుగా ఒకే ఇంట్లో ఉంటున్నామని తమకు ఈ ఇల్లు తప్ప ఎక్కడా స్థలాలు లేవని వాపోయారు. దీంతో రెవెన్యూ అధికారులు వెనుతిరిగారు.

సరోజినినాయుడు మహిళలకు ఆదర్శం

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): భారతకోకిల సరోజిని నాయుడు మహిళలకు ఆదర్శమని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి పేర్కొన్నారు. గురువారం కళాశాలలో సరోజనినాయుడి 146వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు, బీబీఏ విద్యార్థినులు పాల్గొన్నారు.

వాహనాలు వేగంగా నడిపితే చర్యలు

ములకలచెరువు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): వాహనాలు అతివేగంగా నడిపి ప్రమాదాలకు కారణమైతే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ నరసింహుడు హెచ్చరించారు. స్థానిక మార్కెట్‌లో గురువారం టమోటాలు తీసుకెళ్ళేట్టి వాహన డ్రైవర్లకు అవగాహన కల్పించారు.